అందరికీ అమ్మ

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 01, 2015

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838

మావో చెప్పాడు..
ఆమె సాధించింది...

క్యాన్సర్‌ను జయించారు..

మనీషా కొయిరాలా

'నీకు క్యాన్సర్ వుంది' అన్న మాటలు వినడానికి ఎవ్వరూ సుముఖంగా వుండరు. సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయించినట్లయితే క్యాన్సర్ మరణ శాసనం కాదు. అయినప్పటికీ... దాని పట్ల పేరుకుపోయిన భయం మాత్రం అలాగే వుంది. క్యాన్సర్‌ను జయించిన సినీ క్రీడా ప్రముఖులు ఆ వ్యాధి పట్ల వగాహన కలిగించే పనిలో వున్నారు. వారిలో బాలీవుడ్ పాత తరం తార ముంతాజ్, బర్ఫీ దర్శకుడు అనురాగ్ బసు, లీసా రే, మనీషా కొయిరాలా, దక్షిణాది తారలు గౌతమి, మమతా మోహన్‌దాస్, క్రికెటర్ యువరాజ్ సింగ్ వంటివారు ప్రముఖంగా వున్నారు.

బాలీవుడ్ ప్రేక్షకులను ఉర్రూతలూగించిన అలనాటి నటి ముంతాజ్. తనకు 54 ఏళ్ల వయసులో క్యాన్సర్ వ్యాధి వున్నట్టు తెలుసుకొన్న ఆమె వైద్యంతోపాటు, వ్యాయామం, మంచి ఆహారం, ఆరోగ్యకరమైన దైనందిన అలవాట్లతో క్యాన్సర్‌ను జయించింది. తనలా క్యాన్సర్‌ని జయించిన అంతర్జాతీయ సెలబ్రిటీలతో తీసిన '1 ఎమినిట్' డాక్యుమెంటరీలో నటించి ఎందరికో చైతన్యాన్ని అందిస్తోంది. 'బర్ఫీ'తో సత్తా వున్న దర్శకుడిగా గుర్తింపు పొందాడు అనురాగ్ బసు. అయితే అతను బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన విషయం మాత్రం చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. 'యమదొంగ'లో 'అబ్బయా...' అన్న డైలాగ్‌తో తెలుగు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్న గాయని, నటి మమతా మోహన్‌దాస్ క్యాన్సర్‌ను జయించి నట జీవితంలో బిజీగా మారింది. 'క్షత్రియ పుత్రుడు, శ్రీనివాస కళ్యాణం, బొమ్మ మాట బంగారు బాట' చిత్రాలతో తెలుగు వారికి సుపరిచితమైన నటి గౌతమి. రొమ్ము క్యాన్సర్‌ను జయించడమే కాక తనలాంటివారెందరికో స్ఫూర్తిని పంచుతూ నేటికీ తన నట జీవితాన్ని కొనసాగిస్తోంది. 'బాంబే, బాబా, లజ్జ, దిల్ సే...' వంటి పలు బహుభాషా చిత్రాలద్వారా అటు బాలీవుడ్‌కు, ఇటు టాలీవుడ్‌కు సుపరిచతమైన నటి మనీషా కొయిరాలా. క్యాన్సర్ వ్యాధి బారిన పడినప్పటికీ పోరాడి విజయం సాధించి... సామాజిక కార్యక్రమాలద్వారా అనేక సమస్యలపై అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తోంది. మోడల్, బాలీవుడ్ నటిగా గుర్తింపు పొందిన తార లీసా రే. 'టక్కరి దొంగ'లో మహేష్‌బాబు సరసన బిపాషా బసుతో పోటా పోటీగా నటించి తెలుగవారికి పరిచయమైన తార. క్యాన్సర్‌ను జయించి ఆరోగ్యవంతమైన జీవి తాన్ని గడుపుతూ ఎందరికో స్ఫూర్తిస్తోంది. క్రికెటర్ యువ రాజ్ సింగ్ ఫీల్డులో ప్రత్యర్థులను ఎదుర్కొన్నంత సులభంగా క్యాన్సర్‌పై విజయం సాధించాడు. 'ది టెస్ట్ ఆఫ్ మై లైఫ్' పుస్తకం రాసి తనలాంటి ఎందరికో స్ఫూర్తినిస్తున్నాడు.



యువరాజ్ సింగ్

అనురాగ్ బసు

లీసా రే

మమతా మోహన్‌దాస్

ముంతాజ్

గౌతమి

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

సర్దుకుపోదాం రండి

ఇంటా.. బయటా.. ఎక్కడ కొంచెం వాతావరణం వేడెక్కినా... ఉద్రిక్తంగా మారినా...ఇబ్బందికరంగా తయారైనా... వినిపించే మాట 'సర్దుకుపోవాలి'. బస్సులోనో, రైల్లోనో రద్దీగా వున్నప్పుడు...'కాస్త సర్దుకోమ్మా...పెద్దదాన్ని. అంతసేపు నిలబడి ప్రయాణం చేయలేను' అన్న అర్థింపు వినిపిస్తుంది. అన్నకో, తమ్ముడికో పండక్కి కొత్తబట్టలు కొనిపెట్టినప్పుడు చిన్నబుచ్చుకున్న ఆడపిల్లకు...'వాళ్లకంటే తెలీదు. నువ్వు ఆడపిల్లవు. అర్థం చేసుకొని సర్దుకుపోవాలమ్మా... అన్నిటికీ పోటీ పడితే ఎక్కడి నుంచి వస్తాయి' అన్న హితోక్తులు తల్లిదండ్రుల నోటెంట వస్తుంటాయి. కుటుంబమంతా కలిసి భోజనం చేసేప్పుడు ముందుగా భర్తకు, తర్వాత మగపిల్లలకు కొసరి కొసరి వడ్డించిన ఇల్లాలు తర్వాత మిగిలిన అడుగూ బొడుగూ కూరతో సర్దుకుపోతుంది. ఆమెకు పసితనం నుంచీ అమ్మానాన్నలు నూరిపోసింది అదే మరి. ఈ సర్దుకోవడం అనే మాట కొన్ని సందర్భాల్లో కొద్దిపాటి మార్పులకు గురవుతుంటుంది. ఎప్పుడూ జంట కవుల్లా కలిసి మెలిసి మెలిగే నేస్తాల మధ్య...వచ్చిన భేదాభిప్రాయాలు చిలికి చిలికి పెద్ద గొడవకు...కొట్లాటలకు దారితీస్తుటాయి. అప్పుడు ఇరువురి శ్రేయోభిలాషులు రంగ ప్రవేశం చేసి 'అర్రే...అలా కొట్టుకుంటే ఎట్లా.సర్దుకుపోవాలి కానీ' అని సర్దిచెప్తుంటారు. చిలకా గోరింకల్లా వుండే భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు వచ్చాయా అంటే... మాటా మాటా పెరగాల్సిందే. అంతా అయ్యాక ...పెద్దమనుషులు రాకా మానరు. సర్దుకుపొమ్మని సలహా ఇవ్వకా మానరు.

కుటుంబాల్లోనే కాదు. రాజకీయ పార్టీల్లోనూ సర్దుకుపొమ్మనే మాట తరచూ వినిపిస్తుంటుంది. ఎన్నికల్లో సీట్ల కేటాయింపు, పదవుల పంపకం, నిధుల విడుదల..వంటి కీలక సమయాల్లో హై కమాండ్ చెప్పే మాట 'సర్దుకుపొమ్మనే'. రక్త సంబంధీకుల మధ్య వచ్చినట్టే నేతల నడుమ కూడా గొడవలు వస్తూనే వుంటాయి. భేదాభిప్రాయాలతో మొదలై కొట్లాటల వరకూ వెళ్తున్న ఘటనలు కోకొల్లలు. ఒక పార్టీ లోనే ఒకరు ఒక మాటంటే ... మరొకరు దానికి విరుద్ధమైన మాట అంటుంటారు. మీడియా వాళ్లకు పండగే పండగ. అటువంటప్పుడే అనుభవజ్ఞులైన నేతలు రంగ ప్రవేశం చేసి సర్దుకు పొమ్మని నచ్చచెప్తుంటారు. అవే పత్రికల్లో పతాక శీర్షికలుగా అవతారమెత్తుతుంటాయి. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. ఒకే పార్టీలోని ఒక నేత ప్రజల మధ్య కుల, మతాల చిచ్చు పెట్టే ప్రకటనలు చేస్తాడు. మరో నేత ప్రజలను సర్దుకు పొమ్మంటాడు. బిజెపి అధికారంలోకి వచ్చాక నేతల నాలుకలు రెండుగా చీలిపోయాయి. ఒక నాలుక మతాన్ని తిట్టి పోస్తుంది. వారి ఆహారపు అలవాట్లను, వారి సంస్కృతిని తప్పుపడుతుంది. మరో నాలుక సర్దుకు పొమ్మంటుంది. ఎన్నికలకు ముందు ఓటర్ల మధ్య చిచ్చు పెట్టడం, ఎన్నికల తరువాత సర్దుకుపొమ్మని సుద్దులు చెప్పటం లేటెస్ట్ ట్రెండ్.

■



◆ మనలో మాట

టపా

స్ఫూర్తినిచ్చిన సెల్వీ

'సెల్వీతో ప్రయాణం' చదివినంత సేపు ఆమెతో కలిసి ప్రయాణం చేసిన అనుభూతి కలిగింది. పద్దెనిమిదేళ్ల వయస్సులో చనిపోవాలనుకున్న ఆమె కర్నాటక తొలి క్యాబ్ డ్రైవర్ కావడం నిజంగా అద్భుతం. తనలాగే తనువు చాలించాలి అనుకుంటున్న ఎంతో మందికి సెల్వీ జీవితం ఆదర్శప్రాయంగా నిలవాలని ఆశిస్తున్నాను. ప్రస్తుత సమాజంలో అందానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఇక అందగత్తెలకు అయితే ఎక్కడలేని క్రేజ్. అందంతోనే ఈ ప్రపంచాన్ని జయించవచ్చు అనే వారికి పూర్తిగా భిన్నంగా చర్మ సమస్యతో ఉన్న చాంటెల్లె బ్రౌన్ యంగ్ మోడలింగ్ ప్రపంచాన్ని తన వైపుకు తిప్పుకున్నది. ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళితే విజయాలు తప్పక వరిస్తాయి. ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే వ్యాసాలు మరిన్ని ఇస్తారని ఆశిస్తున్నాను.

గోపి, వల్లూరు, కడప

కళ్లకు కట్టిన కథనం

చెడు మీద మంచి సాధించే విజయం కనక ప్రతి తెలుగువారు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. వారి విజయాలకు చిహ్నంగా తొమ్మిది రోజుల పాటు నృత్యాలు, కోలాటాలు, పులి వేషం మొదలగునవి జరుపుకునేవారు. మైసూరులో జరిగే ఉత్సవాలు కన్నుల పండగలా ఉంటాయి. ఈ వ్యాసం చదివినంత సేపు మైసూరులోని ఉత్సవాలను తిలకించిన ఆనందంగా ఉంది. అలాగే వివిధ రాష్ట్రాల్లో ఈ ఉత్సవాలను ఎలా జరుపుకుంటారో తెలియజేయడం బాగుంది. పురాతన దేవాలయాల విశిష్టత తెలిపే మరిన్ని వ్యాసాలు ఇవ్వాలని కోరుకుంటున్నాను.

శ్రీను వేముల, పులివెందుల, కడప

నవ్వులు పూశాయి

ప్రజాప్రయోజన వ్యాజ్యంతో పాటు రోడ్డుపైన ట్రాఫిక్ నియంత్రించడమే పనిగా పెట్టుకున్న రామస్వామి జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. ఈ వారం నవ్వుల్-పువ్వుల్ బాగున్నాయి. రాజస్థాన్‌లోని మౌంట్ అబూ దేవాలయం జక్కన చెక్కిన శిల్పంలా ఉంది. దేవాలయంలోని ప్రతి అడుగు ఎంతో అద్భుతంగా, సుందరమైనదిగా తీర్చిదిద్దిన కళాకారుల నైపుణ్యం అద్భుతం. అక్కడి శిల్పసౌందర్యం గురించి కళ్ళకు కట్టినట్టు చూపించిన అంశం బాగుంది.

మల్లికార్జున రెడ్డి, ఆముదాల వలస, శ్రీకాకుళం.

ఏకబిగిన చదివాం

పిసిని గొట్టు కథ ఆద్యంతం ఏకబిగువున చదివించే విధంగా ఉంది. డాక్టర్ గారితో బేరసారాలు ఆడటం, చివరికి ముక్కూ మొహం తెలియని మహిళ వైద్యానికి అయ్యే ఖర్చును తానే భరిస్తానని చెప్పడం వంటి విషయాలతో కథ నడుస్తుంది. మనిషిలో మార్పు కలగడం సహజమే అని చెప్పడానికి ఈ కథను ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ వారం రుచి బాగుంది. కండలు తిరిగిన దేహం మగవారికే కాదు. ఆడవారికి కూడా సాధ్యమే అని చెప్పిన శ్వేత రాథోర్ ... బాడీ బిల్డర్‌గా తాను అనుకున్నది చేసి చూపించిన ధీర.

పుల్లయ్య, నాగాసాని పల్లె, ఓబులవారి పేట

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

మావో చెప్పాడు..ఆమె సాధించింది..

కవర్ స్టోరీ ———— 6

మలేరియా సోకిన కోట్లాది మంది ప్రాణాలను కాపాడిన ఔషధం 'ఆర్టెమైసినిన్'ను కనిపెట్టడంలో కీలక పాత్రధారి చైనా శాస్త్రవేత్త 'తు యుయు'. చైనా ప్రభుత్వం తరపున... ప్రాచీన వైద్య పరిశోధకురాలిగా... ప్రపంచ మానవాళికి...ఆమె అందించిన అపురూపమైన బహుమతి ఈ ఔషధం. దీన్ని ఆవిష్కరించిన నలభై నాలుగేళ్లకు ఆమెకు నోబెల్ రూపంలో ప్రతిష్టాత్మక గుర్తింపు వరించింది. అయితే మలేరియా ఔషధాన్ని తయారు చేయాల్సిందిగా 'యుయు'ని చైనా నేత మావో కోరాడన్న విషయం చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసిన విషయం. సంప్రదాయ వైద్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఆధునిక వైద్యంతో జోడిస్తే మానవాభివృద్ధి గణనీయంగా జరుగుతుందన్న వాస్తవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన 'యుయు'పై ఈ వారం ప్రత్యేక కథనం.

స్ఫూర్తి 3
నగర రైతు ఇంటి పంట

యువ 4
అజ్ఞానానికి ప్రథమ చికిత్స

కార్టూన్ పంచ్ 5

వంట 10
ఈ- ఇంటి వంట

నవ్వుల్ పువ్వుల్ 11

సినిమా కబుర్లు 14
అందరికీ అమ్మ

వింత లోకం 16
బొమ్మలాంటి జీవితం

లఘు చిత్రం 17
స్వామీజీ బిజినెస్

కథ 18
పరివర్తన

రుచి 21
మటన్ పసందే

బాల నేస్తాలు 22
మీసాల పక్షి

కొత్త పుస్తకాలు 24
కొల్లేటి జాడల్లో..



ప్రత్యేకం -12
రికార్డుల మోత



నగర రైతు ఇంటి పంట

కాంక్రీట్ అరణ్యాలైన నగరాల్లో పెరటి పంట కొత్త రెమ్మ తొడిగింది. నగర సేద్యంగా పరిణామం చెంది బాల్కనీల్ని కాయిస్తోంది. టెర్రస్‌లను పండిస్తోంది. ఈ ఇంటి పంటకు సేంద్రీయ పద్ధతుల్ని జోడించి ఆరోగ్యకరమైన విందు చేసే పనిలో ఉన్నారు కొందరు నగర రైతులు. ఆన్‌లైన్‌తో ప్రతి గడపను తొక్కి ఓ మొక్క మొలిపించే ప్రయత్నం చేస్తున్నారు.

పేరుకు మహానగరాలు. రెండు రోజులు గ్రామాల నుంచి కూరగాయలు, పాలు రాకపోతే నగరజీవి ఆకలి కేకలు పెట్టేస్తాడు. తినేందుకు ప్రతిదీ పల్లెల నుంచి వెళ్లాల్సిందే. నగరాల్లో స్వతహాగా నాలుగు పచ్చిమిర్చిని పండించుకోలేని చోటెందుకు అనిపిస్తుంది కొందరికి. మరికొందరి ఫిర్యాదేమో లాభాల కోసం పురుగు మందుల్ని యథేచ్ఛగా వాడేసి మగ్గబెట్టేస్తుంటారని, ఈ రెండిటికీ సమాధానంగా నగర సేద్యం పుట్టుకొచ్చింది. ప్రతి ఇంటి అవసరాన్ని తీర్చేంతగా కాకున్నా కొన్ని వేల కుటుంబాలు ఇప్పుడు ఆరోగ్యకరమైన ఆర్గానిక్ పంటను ఇంటిలో పెంచుతూ ఓ పూట వంట కానిస్తున్నారు. బాల్కనీలోనే, మెట్ల వరసపైనో, టెర్రస్ మీదో, లేదా వసారాలో ఓ మూలో.. ఎక్కడ కాసింత జాగా దొరికితే అక్కడ, ఎక్కడ సూర్యరశ్మి తగిలితే అక్కడ వినూత్న ప్రయోగాలతో అర్బన్ ఫార్మింగ్‌కు విత్తు వేస్తున్నారు ఈ నగర రైతులు. అపార్ట్‌మెంట్ వాసులకు కూడా మట్టిని ముద్దాడే అవకాశాన్నిస్తున్నాయి వీరి టెక్నిక్‌లు. క్రిమిసంహారకాల గొడవ లేకుండా భారీ ఖాళీ జాగాతో పనిలేకుండా ఉన్న కొద్ది చోటును మొక్కల వరసలతో హరితమయం చేయడమే కాక ఓ పూట భోజనానికి కాయగూరల్ని పండించే వ్యాపారంతో లాభాల్ని ఆర్జిస్తున్నారు. బెంగళూరులో ఎక్కువగా కనిపించే ఈ సేద్య పద్ధతిని కొందరు యువత ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి మహా నగరాలకే కాక మిగతా పట్టణాలకు తమ సేవల్ని విస్తరిస్తున్నారు. అంది వచ్చిన ఐటీ విప్లవాన్ని ఆసరా చేసుకుని ఆన్‌లైన్ షాపులు, కన్సల్టెన్సీ సేవలతో ప్రతి గడపలో కాయో, పండో కాయిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న కాలం నగర సేద్యానిదేనని చెబుతున్నారు.

ముంబై రైతు

గజం స్థలం కనిపిస్తే ఏదో ఒక యుటిలిటీకి మార్చేసేంత కాస్ట్‌లీ ఈ నగరం. 22 ఏళ్ల ప్రియాంక అమర్ ఇక్కడే మట్టికి ప్రాణం పోసింది. మట్టికి ప్రకృతి సహజంగా సత్తువ తెచ్చే పని దగ్గరి నుంచి విత్తనాలు, ఎకో ఎరువు, మొక్కలు, పరికరాలు, చోటుకు నప్పే కుండీలు వంటి ప్రతిదీ దొరికే 'ఐఖేతీ' అనే ఆన్‌లైన్ వ్యాపారాన్ని మొదలెట్టింది. ఆర్గానిక్ కూరగాయలు, పండ్లు పెంచేందుకు కావాల్సినవన్నీ ఇక్కడ ఆర్డరివ్వొచ్చు. కేవలం ఇదే కాక సస్య రక్షణ, వ్యర్థాల పునర్వినియోగం వంటి విషయాల్ని వినియోగదారులకు వివరించే ఏర్పాటు చేసింది. అవసరమైతే తానే వెళ్లి మెళుకువల్ని నగర రైతుకు నేర్పి వస్తోంది. ఐఖేతీ ప్రారంభించిన రెండేళ్లలోనే వ్యాపారం లాభాల పంట పండిస్తోంది.

ఢిల్లీ లీగ్

దేశ రాజధాని ఢిల్లీ సంగతి వేరే చెప్పక్కర్లేదు. అక్కడే పని ప్రారంభించాడు పంకజ్ అరోరా. అతడి లెక్క ప్రకారం 60 లక్షల గృహాల్లో నగర సేద్యానికి కిటికీలు తెరిచి ఉంచాయట. ఈ విషయం తెలిసిపోయే సరికి ఉద్యోగానికి చీటీ ఇచ్చేసి తల్లితో కలసి 'ది అర్బన్ ఫార్మర్స్ లీగ్' అనే సేంద్రీయ పంటల మార్కెట్‌ను ఆన్‌లైన్‌లో తెరిచేశాడు. ఏదీ మిస్ కొట్టకుండా కిటికీలకూ పనికొచ్చే వ్యవసాయ కిట్‌లను సరఫరా చేస్తున్నాడు. అవి మాడ్రన్ దంపతులకూ చేరేలా డూ ఇట్ యువర్‌సెల్ఫ్ కిట్‌లని పేరు పెట్టాడు.

చెన్నై సస్యమిత్రులు

కేరూ అగర్వాల్ మరో నలుగురు మిత్రులతో కలసి ది అర్బన్ ఫార్మర్స్ అనే ఎకో వ్యాపారాన్ని చెన్నైలో షురూ చేశాడు. నగర సేద్యంపై కాలేజీ రోజుల్లోనే బిజినెస్ ప్రాజెక్ట్ చేపట్టిన ఈ మిత్రబృందం ఐదేళ్లపాటు పలు ఉద్యోగాలు చేశాక తిరిగి ఇక్కడికే చేరారు. అర్బన్ ఫార్మింగ్‌ను పెద్ద ఎత్తున చేపట్టేందుకు పది ప్రణాళికల్ని రచించుకుని ప్రస్తుతం ఫోకసంతా రెండిటిపైనే ఉంచారు. ఒకటి కన్సల్టెన్సీ. నగర సేద్యంలో ఏ మాత్రం డౌట్లున్నా వీరికి ఓ ఫోన్ కొడితే చాలు. సమస్య పరిష్కారం అయ్యే వరకు వెంటుంటారు. రెండోది నగర రైతులు పండించిన ఉత్పత్తిని సేకరించి దాన్ని మార్కెట్ చేయడం. రెండూ మంచి లాభాల్ని చేకూర్చడంతో మిగతా ఎనిమిదింటికి కూడా నీళ్లు పోస్తున్నారు.

గోవా రైతు దంపతులు

పదకొండేళ్లుగా యోగి ఫార్మ్ పేరిట సేంద్రీయ ధాన్యాలు, కూరగాయలు, పండ్లు గోవా ప్రజలకు రుచి చూపిస్తున్నారు కరణ్ మన్రాల్, యోగిత దంపతులు. ది సీడ్ స్టోర్ పేరిట ఆన్‌లైన్ మార్కెట్‌ను తెరిచి సేంద్రీయ ఉత్పత్తుల్ని అమ్ముతున్నారు. ఆరోగ్యకరమైన సేంద్రీయ ఉత్పాదనల వినియోగానికే గోవా వాసులు కూడా మొగ్గు చూపడంతో వీరి ఫలసాయం లాభసాటిగా మారింది. మిగతా నగరవాసులు కూడా అర్బన్ ఫార్మింగ్ చేసేందుకు వీలుగా వీరు విత్తనాలను, మొక్కలను, పరికరాల్ని మార్కెట్ చేస్తున్నారు. ఇలా ఒక్కో నగరంలో ఒక్కో నగర రైతు పెరటి పంటకు విశేష ప్రచారం చేస్తున్నారు. ఇంటి పంటపై వ్యాపారాన్ని మొదలెట్టి లాభాల్ని ఆర్జిస్తున్నారు. వీరి విజయాలు మరికొందరికి ప్రేరణగా నిలిచి అపార్ట్‌మెంట్ కిటికీల్లో పచ్చదనం కనిపించేలా చేస్తున్నాయి.

సునామీతో కకావికలమయ్యాం. ముంబై వరస పేలుళ్లతో షాక్‌కు గురయ్యాం. కచ్ భూకంపంతో వణికిపోయాం. వీటి తర్వాత ఏదైనా మార్పు వచ్చిందా? రీటా సాల్వా జీవితంలో మాత్రం పెనుమార్పే సంభవించింది. అత్యవసర సమయాన ఏం చేయాలనే విషయంపై సమాజానికి ప్రథమ చికిత్స చేస్తూ మార్పు తెచ్చే ప్రయత్నంలో ఉంది.

అజ్ఞానానికి ప్రథమ చికిత్స

అది కచ్ భూకంపం అలజడి రోజులు. బాధితుల్ని కాపాడేందుకు వచ్చిన వలంటీర్లలో రీటా సాల్వా ఒకరు. వైద్య శాస్త్ర పట్టాదారు కావడంతో ఆమె పని చికిత్స కేంద్రంలో. వలంటీర్లే కాదు సాటి పౌరులు కూడా బాధితుల్ని భుజాన మోస్తూ కేంద్రానికి తీసుకొస్తున్నారు. ఆ గందరగోళంలో గాయాలైనవారికి ఏ ప్రథమ చికిత్స చేయాలో, ఎలా తరలించాలో చాలా మందికి తెలియదు. అలా ఓ వ్యక్తి 9 నెలల పాపను తీసుకొచ్చాడు. పాదాలకు, కాళ్లకు దెబ్బ తగలడంతో రక్తస్రావాన్ని ఆపేందుకు బాగా బిగుతుగా కట్టు కట్టి కేంద్రానికి తీసుకొచ్చారు. ఆ దృశ్యం చూడగానే రీటా వణికిపోయారు. ఆ చిన్నారికి తగిలిన గాయానికి అంత గట్టిగా కట్టు వేయకూడదు. దాని వల్ల రక్త సరఫరా నిలిచి ప్రాణాంతకం అవుతుంది. రీటా భయపడిందే జరిగింది పాప రెండు కాళ్లు కోల్పోయింది. కచ్ జన జీవనం కోలుకుని మళ్లీ పరుగులు తీసింది కానీ, ఆ పాప జీవితం స్తంభించిపోయింది. ఆ పాప విషయమే పదేపదే రీటాకు గుర్తొచ్చి నిద్ర పట్టనివ్వలేదు. అదే కాదు సునామీ సమయంలో, బాంబు పేలుళ్లపుడు వార్తా చానెళ్లలో ప్రసారమైన దృశ్యాలు ప్రథమ చికిత్స నిర్వర్తించడంలో దేశం ఎంత వెనుకబడి ఉందో పట్టిచూపేవి. పోలీసు వాహనాల్లో, ఆటోల్లో, ట్యాక్సీల్లో క్షతగాత్రుల్ని కుక్కుతూ, సరైన ప్రథమ చికిత్స చేయకుండా బయటకు పొడుచుకొచ్చిన భాగాలతోనే, రక్తం చిందుతున్న దేహాలతోనే, విడిపోయిన అవయవాల్ని వెంట తేకుండానే ఆస్పత్రులకు తరలింపు అనే పెద్ద తప్పిదాన్ని పదేపదే వీక్షించి ఆమె ఊరకే ఉండలేకపోయారు. ఆ తప్పిదం వల్ల కొందరు వికలాంగులవుతారు. కొందరు ప్రాణాలు కోల్పోతారు. కొందరు ఏళ్లకు ఏళ్లు ఆస్పత్రి మంచాలకు బానిసలవుతారు. తమ మీద ఆధారపడిన కుటుంబానికి పెద్ద భారమవుతారు. ఈ ప్రమాదాన్ని తప్పించేందుకే అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స ఎలా చేయాలో పౌరులకు నేర్పేందుకు రీటా సాల్వా రాధీ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు, వలంటీర్లకు, స్థానికులకు సమగ్ర శిక్షణనిచ్చి బాధితులు మెరుగైన ప్రథమ చికిత్స పొందేలా చేస్తున్నారు. అంతర్జాతీయ సంస్థ సెయింట్ జాన్స్ అంబులెన్స్‌తో చేతులు జోడించి సరైన సమయంలో సరైన చికిత్సను చేరువ చేస్తున్నారు. ఓ వైపు వర్క్‌షాపులతో ఇలా సరైన విధానాల్ని నలుదిశలా వ్యాప్తి చెందిస్తూ ఉన్న రీటా దృష్టి నిత్యం యాక్సిడెంట్ వార్తలతో భయంగొలిపే ముంబై లోకల్ ట్రైన్ స్టేషన్లపై పడింది. విపరీతమైన రద్దీ వల్ల రోజుకు పదిమంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుంటారు. మరో పది మంది తీవ్రగాయాల పాలవుతారు. మరణాల సంఖ్యను, క్షతగాత్రుల తీవ్రతను తగ్గించేందుకు ఆమె మరో ఏడుగురు వలంటీర్లతో కలిసి రైల్వేస్టేషన్లలో క్యాంపులను నిర్వహిస్తున్నారు. స్టేషన్ మేనేజర్, రైల్వే పోలీసులు, పోర్టర్లు, దుకాణదారులు, రోజువారీ ప్రయాణీకులు చివరకు షూ పాలిష్ చేసే కుర్రాళ్లకు శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు రకాల ఆత్యయిక పరిస్థితులకు తగ్గట్టు వేగంగా స్పందించే సహాయక బృందాల్ని తయారుచేస్తున్నారు. తొలుత పశ్చిమ రైల్వే లైనులోని స్టేషన్‌కు 30 మంది చొప్పున 21 స్టేషన్లలో 600 మందికి పైగా వలంటీర్లను తయారుచేశారు. ప్రస్తుతం మధ్య రైల్వే లైన్ స్టేషన్లలో పని మొదలు పెట్టారు. ఒకప్పుడు ప్రమాదం జరిగిన ఏ గంటకో సహాయం అందే పరిస్థితి. గాయాలతో చావు అంచున ఉన్న బాధితుల్ని చూసి పక్క నుంచి వెళ్లే వారు ఓ క్షణం నిలిచి 'వో నహీ బచ్ పాయేగా' అని తీర్మానించేసి వెళ్లిపోయేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. ప్రమాదం జరిగిన 7 నిమిషాల్లో అత్యవసర సహాయక బృందం పనిమొదలు పెట్టేస్తోంది. 1 స్టేషన్ మేనేజర్, నలుగురు పోర్టర్లు, ఓ రైల్వే కానిస్టేబుల్ సంఘటితంగా పనిచేసి నిండు ప్రాణాల్ని నిలబెడుతున్నారు. శాశ్వత వైకల్యం ప్రాప్తించకుండా, ఆస్పత్రి బెడ్‌కు జీవచ్ఛవాలుగా వేలాడకుండా కొందరినైనా కాపాడగలుగుతున్నారు. రీటా సాల్వా ముంబై రైల్వే స్టేషన్ పట్టాల పక్కన ప్రారంభించిన పని దేశవ్యాప్తంగా పట్టాలెక్కించేందుకు మరికొందరు ముందుకు రావాలి. ✦


జలగ పరీక్ష అని కొత్తగా వచ్చిందిలే!!
ప్రభుత్వ ఆసుపత్రి
ఇక వైద్య పరీక్షలన్నీ ప్రైవేట్ పరమే

కార్టూన్ పంచ్


చెరువుకు నీళ్ళు పిడికెడు మట్టి
బాగా షాక్ తగిలినట్టుంది డాక్టర్!!
?!



మావో చెప్పాడు... ఆమె సాధించింది...

మలేరియా సోకిన కోట్లాది మంది ప్రాణాలను కాపాడిన ఔషధం 'ఆర్టెమైసినిన్'ను కనిపెట్టడంలో కీలక పాత్రధారి చైనా శాస్త్రవేత్త 'తు యుయు'. చైనా ప్రభుత్వం తరపున... ప్రాచీన వైద్య పరిశోధకురాలిగా... ప్రపంచ మానవాళికి... ఆమె అందించిన అపురూపమైన బహుమతి ఈ ఔషధం. దీన్ని ఆవిష్కరించిన నలభై నాలుగేళ్లకు ఆమెకు నోబెల్ రూపంలో ప్రతిష్టాత్మక గుర్తింపు వరించింది. వ్యక్తిగతంగానే కాక జన చైనాకూ ఈ అవార్డు ఎంతో ప్రతిష్టాత్మకమైనది. వైద్యంలో ఆ దేశం అందుకుంటున్న తొలి నోబెల్‌గా... అందునా మెడిసిన్‌లో మహిళ అందుకుంటున్న నోబెల్‌గా... రెండు విధాలుగా ఈ అవార్డు ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే మలేరియా ఔషధాన్ని తయారు చేయాల్సిందిగా 'యుయు'ని చైనా నేత మావో కోరాడన్న విషయం చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసిన విషయం. సంప్రదాయ వైద్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఆధునిక వైద్యంతో జోడిస్తే మానవాభివృద్ధి గణనీయంగా జరుగుతుందన్న వాస్తవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన 'యుయు'పై ఈ వారం ప్రత్యేక కథనం.

కె.అంజన

ఎనిమిది పదులు పైబడిన వృద్ధాప్యం. ఆ వయసు తెచ్చిపెట్టిన నిండుదనం, నెమ్మదితనం. ఉద్వేగాలను కానరానివ్వని అపార అనుభవం. పరిపక్వత. సాలోచనతో కూడిన మాట. చేత. అన్నిటినీ మించి తన తదనంతరం తర్వాతి తరాలకు ఉపయోగపడేదేదో అందించి వెళ్తున్నానన్న తృప్తి వంటి అరుదైన అంశాలకు ఐదడుగుల రూపం ఇస్తే ... చైనా శాస్త్రవేత్త 'తు యుయు' మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. సుదీర్ఘకాలంపాటు వైద్య పరిశోధనలకే అంకితమైన ఆమె జీవితం అంతా ఆసక్తికరమే. స్ఫూర్తిదాయకమే. ఇంటా బయటా మూలికా వైద్యానికి వున్న ప్రాధాన్యత ఆమెలో ఓ రకమైన ఆసక్తిని రేకెత్తించి ... అదే చివరికి తన జీవిత లక్ష్యమై...పట్టుదలతో సాధించిన తీరు ... తరతరాలకు తరగని స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

సాదా సీదా జీవితం

చైనాలోని ఓ చిన్ని పట్టణం నింగ్బో. షాంఘైకి 140 మైళ్ల దూరంలో వుంటుంది. అక్కడ 1930లో నలుగురు అన్నదమ్ముల నడుమ పుట్టిన ఆడపిల్ల 'తు యుయు'. అమ్మాయి అయినప్పటికీ ఆ రోజుల్లోనే ఆమెను బడికి పంపారు తల్లిదండ్రులు. 1951 నుంచి 1955 వరకు పెకింగ్ యూనివర్సిటీ మెడికల్ స్కూల్లో వైద్య విద్యను అభ్యసించింది. ఆ తర్వాత రెండున్నరేళ్ల పాటు సంప్రదాయ చైనా వైద్యంలో శిక్షణ పొందింది.గ్రాడ్యుయేషన్ అనంతరం

చైనీస్ మెడికల్ అకాడమీలో చేరి బెంచ్ సైంటిస్ట్‌గా ... రీసెర్చర్‌గా...సైంటిస్ట్‌గా చేసి ప్రస్తుతానికి చీఫ్ సైంటిస్ట్‌గా సేవలు అందిస్తోంది. వైవాహిక జీవితం గురించి చెప్పుకోవాల్సి వస్తే... తన సీనియర్ విద్యార్థి 'లి టింగ్‌ఝావో'తో పెళ్లి... ఇద్దరు ఆడపిల్లలు. వారిలో ఒకరు బీజింగ్‌లో స్థిరపడగా...మరొకరు కేంబ్రిడ్జి యూనివర్సిటీ బోధకురాలిగా వున్నారు. మొత్తంమీద జీవితంలోని అన్ని దశల్లోను భర్త, పిల్లలు, తల్లిదండ్రులు అందించిన సహాయ సహకారాలు ఆమెకు అన్నింటా విజయం సాధించడానికి దోహదపడ్డాయి. వైద్య విద్య...పరిశోధనలు... మానవాళిని కాపాడే ఆవిష్కరణలు... ప్రపంచ ప్రసిద్ధ అవార్డుల మధ్యన సైతం యుయు అత్యంత సాదాసీదా జీవితాన్ని ఇష్టపడుతుంది. ఇప్పటికీ ఎలాంటి డాంబికాలు, పటాటోపాలు ఆమెలో మచ్చుకైనా కనిపించవు. నిగర్విగా నిశ్చలంగా తన పనిలో తను నిమగ్నమౌతుంది.

వ్యక్తిగతం

పేరు: తు యుయు

దేశం: చైనా

నివాసం: బీజింగ్

వయసు: 84 (డిసెంబర్ 30, 1930)

వృత్తి: చీఫ్ ప్రొఫెసర్, చైనా సంప్రదాయ అకాడమీ

భర్త: లి టింగ్ ఝావో (ఇంజనీర్)

పిల్లలు: ఇద్దరు కుమార్తెలు

కృషి: మలేరియా మందు ఆర్టెమైసినిన్ ఆవిష్కరణ

గుర్తింపులు: అమెరికా ప్రతిష్టాత్మక అవార్డు 'లాస్కర్ అవార్డు' (2011), వైద్యశాస్త్రంలో నోబెల్ (2015)



మావో అప్పగించిన రహస్య ప్రాజెక్టు

1960ల్లో మలేరియా ప్రాణాంతక వ్యాధి కిందే లెక్క. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో లక్షలాది మంది ఆ రక్కసి బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో... వియత్నాం యుద్ధం జరిగింది. అదీ అమెరికాతో. యుద్ధంలో శత్రువు ఆయుధాలకు ప్రాణాలు కోల్పోయే వారి కంటే మలేరియా సోకి చనిపోయేవారి సంఖ్య అధికంగా వుండేది. అప్పుడు వియత్నాం నేత హోచిమిన్ చైనా నాయకులు మావో, చౌయిన్ లైల సాయం కోరాడు. మలేరియాకు మందు కనిపెట్టకపోతే సైన్యాన్ని పెద్ద ఎత్తున కోల్పోవాల్సి వస్తుందన్న బాధను వ్యక్తం చేశాడు. 1967, మే 23వ తేదీన చైనా అధినేత మావో ఒక రహస్య ప్రాజెక్టును ఏర్పాటు చేశాడు. దానికి '523' అన్న పేరు పెట్టాడు. సైనిక కనుసన్నల్లో నడిచే ఆ ప్రాజెక్టు ఏర్పాటు చేసిన నెల, తేదీలను కలిపి పెట్టిన పేరు అది. ఆ ప్రాజెక్టులో చరిత్రకారులు మొదలుకొని ఆధునిక, ప్రాచీన, మూలికా, సూది వైద్యంలో నిష్ణాతులు వున్నారు. అయినా ఫలితం కనిపించలేదు. అప్పుడు మావో ఆ ప్రాజెక్టును నడిపే బాధ్యతను ప్రభుత్వం తరపున 'తు యుయు'కు అప్పగించాడు. ఆమెను మాత్రమే ఎంపిక చేయడంలో ఒక కారణముంది. 'యుయు' ప్రాచీన, ఆధునిక వైద్యాల్లో శిక్షణ పొందిన నిష్ణాతురాలు. అప్పుడామెకు 39 సంవత్సరాలు. సుదూర ప్రాంతంలో పని చేసే భర్త, ఇద్దరు చిన్నారి పిల్లలు. అయితే అప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఎందరో శాస్త్రవేత్తలు మలేరియా క్రిమిని అంతమొందించడం కోసం 2,40,000 ఔషధాలను పరిశీలించారు. దాన్ని బట్టే తనపై వుంచిన బాధ్యత ఎంత పెద్దదో ఆమెకర్థమైంది. తనను విశ్వసించి అప్పగించిన బాధ్యతకే తొలి ప్రాధాన్యత ఇచ్చింది. నాలుగేళ్ల వయసున్న పెద్ద కుమార్తెను బీజింగ్ నర్సరీలో చేర్పించి, మూడేళ్ల చిన్న కూతుర్ని

ఆర్టెమైసినిన్ అందించిన మొక్క

తల్లిదండ్రుల దగ్గర వదిలింది. మలేరియా విపరీతంగా ప్రబలిన హునాన్ రాష్ట్రానికి వెళ్లి పరిశోధన ప్రారంభించింది. అక్కడి రోగులు, వారి రోగ లక్షణాలు, వ్యాధి వ్యాపిస్తున్న తీరును అత్యంత సమీపంగా పరిశీలించింది. ఆరు మాసాల అనంతరం తిరిగి ఇంటికి వెళ్లిన ఆమెను కూతురు గుర్తుపట్టలేకపోయింది. కుటుంబం కంటే తనకు అప్పగించిన బాధ్యతకు ఎంత ప్రాధాన్యతనిచ్చిందో తెలుసుకోవడానికి ఈ ఘటన ఒక మచ్చుతునక.

'యుయు' బృంద పరిశోధన నల్లేరుపై నడక కాదు. ఎన్నో చిక్కుముళ్లు. జవాబులేని ప్రశ్నలు. విసుగూ విరామం లేకుండా రాత్రింబవళ్లు వందలాది ఔషధాలను, రెసిపీలను పరీక్షించారు. స్వయంగా దేశంలోని మూలమూలలకు వెళ్లి సంప్రదాయ వైద్య గ్రంథాలను అధ్యయనం చేసింది 'యుయు'. వందలాది సంప్రదాయ వైద్యులను, పాత తరం వారిని స్వయంగా కలిసి మాట్లాడి ఎన్నో విషయాలను సేకరించింది. ఆ పద్ధతుల్లో పలుసార్లు వడపోయగా...పోయగా... అత్యంత పురాతన కాలం నుంచి జ్వరాలకు వాడే 'కింగ్ హో' (స్వీట్ వార్మ్‌వుడ్ / ఆర్టెమైసియా యానువా) మొక్క నుంచి గ్రహించిన రసాయన సమ్మేళనం మలేరియాకు పని చేస్తుందని గుర్తించారు. అయితే సంప్రదాయ చైనా వైద్యంలో మూలికలను





ప్రయోగశాలలో....



సాధారణంగా ఆ కింగ్ హో అనే పిలుస్తారు. పైగా ఆ పేరుతో ఆరు రకాల మొక్కలున్నాయి. వాటిలోని రసాయన సమ్మేళనాలు కూడా ఆరు రకాలుగా వుంటాయి. దాంతో ఏ మొక్క మలేరియాకు సరైనది? ఆ మొక్కలో ఏ భాగం ఔషధ తయారీకి ఉపయోగపడుతుంది? దాన్ని ఏ పద్ధతుల్లో సేకరించాలి? వంటివన్నీ జవాబుల్లేని ప్రశ్నలే. చివరికి 'ఆర్టెమైసి యానువా ఎల్' మలేరియాకు సరైన ఔషధమొక్క అని గ్రహించారు. అయితే ఆ మొక్కలో ఏ భాగం ఔషధ తయారీకి పనికి వస్తుందో తెలుసుకోవాలి. పుష్పాలా, పత్రాలా, కాండాలా? అనేది తేలాలి. ఇన్ని చికాకుల మధ్య నీరస పడకుండా... అన్ని దశల్లోనూ మావో నుంచి చక్కటి మద్దతు, ప్రోత్సాహం లభించింది వీరికి. ఆ స్ఫూర్తితోనే మరింత ఉత్సాహంగా పనిచేశారు శాస్త్రవేత్తలు. నాల్గవ శతాబ్దానికి చెందిన గె హంగ్' అత్యవసర చికిత్సగా చెప్పిన రెండు వాక్యాలు 'యుయు'ను ఆలోచింపచేశాయి. దాన్ని పదే పదే చదివింది. 'గుప్పెడు కింగ్ హో ఆకులను తీసుకొని రెండు షెంగుల (2x2 లీటర్ల) నీటిలో ఉడికించి ... ఆకులు తీసేసి ఆ ద్రవాన్ని రోగితో తాగించాలి' అని వుంది. అయితే నీటిని మరిగిస్తే ఆకుల్లో వున్న ఔషధ గుణాలు నాశనమౌతాయని భావించింది 'యుయు'. అందుకే తక్కువ ఉష్ణోగ్రత వద్ద నీటిని కాచి ... తయారు చేసిన ఔషధాన్ని ముందుగా ఎలుకలు, కోతులపై ప్రయోగించింది. ఫలితం కనిపించింది. అన్ని సంవత్సరాల పాటు పడిన కష్టం ఫలించేసరికి ఆ బృందం ఆనందం అంతా ఇంతా కాదు. మనుషుల మీద కూడా ప్రయోగించి చూసి ఎటువంటి ప్రమాదం లేదనుకుంటే మందుగా వాడవచ్చు. ప్రాచీన వైద్య గ్రంథాల్లో ఈ ఔషధాన్ని ఉపయోగించిన ప్రస్తావనలు చదివి వుండడంతో ఎలాంటి ప్రమాదమూ వుండదని ఆమె భావించింది. పైగా ప్రాజెక్టు నాయకురాలిగా అది పూర్తిగా తన బాధ్యత అనుకుంది. అందుకే మొదటిసారిగా తనే ఆ ఔషధాన్ని తాగింది. గుణం కనిపించింది. తర్వాత ప్రాజెక్టు ఇతర సభ్యులు కూడా ధైర్యంగా తాగేశారు. ఇంతమందిపై ప్రయోగం అయ్యాక ... హునాన్‌లో 21 మంది మలేరియా రోగుల మీద ప్రయోగించారు. ముందుగా వారికి జ్వరం తగ్గింది. తర్వాత రక్తంలోని మలేరియా క్రిములు నశించాయి. దానికి ఆధునిక పద్ధతులు జోడించి తయారు చేసినదే 'ఆర్టెమైసినిన్'. ప్రపంచ మానవాళిని మలేరియా బారి నుంచి కాపాడ్డానికి 1971లో తయారైన దివ్య ఔషధం అది. దీనికి మూడు సుగుణాలున్నాయి. 1.వేగంగా వ్యాధిని తగ్గిస్తుంది. 2. దుష్ప్రభావాలు తక్కువ. 3. వ్యాధి నిర్మూలనలో సాధించే విజయావకాశాలు మెండుగా వుంటాయి. 2000 సంవత్సరంలో మలేరియా మరణాలు రెండు మిలియన్లు వుండగా... 2013లో దాదాపు 5,84,000 మంది చనిపోయారని ప్రపంచ ఆరోగ్య

సార్థక నామధేయురాలు

'తు యుయు'కి పేరు పెట్టినప్పుడు తండ్రి ఊహించి వుండడు. అదే ఆమె జీవిత సర్వస్వమౌతుందని. చైనా తత్వవేత్త కన్‌ఫ్యూషియస్ రచించిన పురాతన కవితా సంకలనంలోని ఒక పదాన్ని (యుయు) తన కుమార్తెకు పేరుగా పెట్టాడు. జింకలు అడవుల్లోని 'హో' ఆకులను (వీటినే చైనాలో 'కింగ్ హో' అని పిలుస్తారు. స్వీట్ వార్మ్ వుడ్, ఆర్టెమైసియా యానువా అని కూడా పిలుస్తారు) తినేటప్పుడు 'యుయు' అన్న శబ్దం చేస్తాయట. అయితే చదువుకునే రోజుల్లో తత్వశాస్త్రాన్ని కాకుండా వైద్య విద్యను ఎంచుకుంది 'యుయు'. చదువు పూర్తయ్యాక... ఆ ఆకులమీదే పరిశోధనలు చేయడం, మలేరియా మందును కనిపెట్టడం యాదృచ్ఛికమే అయినా పేరుకు తగ్గ పనిలోనే జీవితమంతా గడిపింది.



తండ్రి, గురువు స్ఫూర్తితో...

నోబెల్ సాధించిన మహిళగా ప్రపంచం ముందు నిలబడిన 'తు యుయు' ఎందరికో స్ఫూర్తి. అయితే సందర్భం వచ్చిన ప్రతిసారీ... తనకు స్ఫూర్తినిచ్చినవారు మాత్రం తన తండ్రి, గురువు అని చెప్తుంటారామె. వైద్య విద్యను అభ్యసించాలన్న నిర్ణయం తీసుకోవడంలో వారి ప్రభావం ఎంతైనా వుందని తన కృతజ్ఞతా భావాన్ని చాటుకుంటారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రాచీన చైనా వైద్యులను ఆశ్ర యించి ఉపశ మనాన్ని పొందే వారిని చాలా దగ్గరగాచూసేది చిన్నారి యుయు. సంప్రదాయ వైద్యులు ఇచ్చేమూలికా మందుల పట్ల అప్పుడే ఆమెకు ఆసక్తి ఏర్పడింది. తర్వాత వైద్య విద్యను ఎంపిక చేసుకున్నప్పుడు తండ్రి ఇచ్చిన ప్రోత్సాహం కూడా అంతా ఇంతా కాదు. సంప్రదాయ వైద్యంలో స్వయంగా ఆయనకు కొంత మేర ప్రవేశం వుండడం అందుకు కారణం. కుమార్తెకు అనేక విషయాలను ఆసక్తికరంగా వివరించేవాడు. ఇక యూనివర్సిటీలో అడుగెట్టాక ప్రొఫెసర్ 'లిన్ క్వీ షో' ఆమెను అమితంగా ప్రభావితం చేశారు. యువతరానికి తన విజ్ఞానాన్ని అందించడంలోను, మూలికల పరిశోధన ప్రాధాన్యతను తెలియచేయడంలోను ఆయనది అందెవేసిన చెయ్యి. దాంతో అప్పటి వరకు ఆమెకు వైద్యం పట్ల వున్న ఆసక్తి కాస్తా ఆరాధనగా మారిపోయింది. తర్వాతి కాలంలో ఆమె చేసిన అధ్యయనాలు, పరిశోధనలు, ఆవిష్కరణలకు అదే కీలకం. అయితే ఆ మందులు, పరిశోధనలు తన జీవితంలో ఎంత పెద్ద స్థానాన్ని ఆక్రమిస్తాయో... అంతర్జాతీయంగా ఎంతటి కీర్తి ప్రతిష్టలను అందిస్తాయో... అప్పుడామె ఊహించనే లేదు. కాలేజీలో వైద్యంపై ఇచ్చిన శిక్షణ ... తదనంతరం రెండున్నరేళ్ల పాటు మెటీరియా మెడికాలో రెండున్నరేళ్లపాటు సంప్రదాయ వైద్యంలో ఇచ్చిన శిక్షణ... చైనా సంప్రదాయ వైద్యం, ఆధునిక ఔషధ విజ్ఞానం...రెండిటిపైన మంచి పట్టు సాధించడానికి ఉపయోగపడింది.

'యుయు' పుట్టి పెరిగిన ఇంటి దగ్గర అభిమానుల సందడి

సంస్థ గణాంకాలు చెప్తున్నాయి.

చైనా అలా.. భారత్ ఇలా...

జన చైనా మన పొరుగు దేశం. సంప్రదాయ, ఆధునిక వైద్యాలను మేళవించి మానవాళికి ఉపయోగపడే ఔషధాలను రూపొందించి ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. అందులో ప్రధానమైనది మలేరియా ఔషధం ఆర్టెమైసినిన్. దేశీయ వైజ్ఞానిక ప్రస్థానాన్ని అధ్యయనం చేయడం, అర్థం చేసుకోవడం, అనువర్తించడంలో చైనా ముందుంది. శాస్త్ర పరిశోధన, అభివృద్ధి రంగాలపై భారీ ఎత్తున కృషి చేస్తూ ప్రపంచ దేశాలకే ఆదర్శంగా వుంది. 2011 నుంచి 2015 మధ్యలో చైనా ప్రభుత్వం 4.7 బిలియన్ డాలర్లను ఒక్క వైద్య పరిశోధనలకే ఖర్చు చేసింది. 1986 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ మద్దతుతో చైనా శాస్త్రవేత్తలు స్వతంత్రంగా 40 రకాల రసాయన ఔషధాలను కనిపెట్టారు. అందులో ఆర్టిమైసినిన్ వంటి మలేరియా నివారిణి ఒకటి. ప్రాణాంతక వ్యాధిని విజయవంతంగా తిప్పికొట్టగలిగే ఔషధాన్ని తయారు చేసినందుకు ఇవాళ నోబెల్ బహుమతిని సైతం అందుకోబోతోంది. మనం మాత్రం ఈ రంగంలో చైనాకు దరిదాపుల్లో కూడా లేం. మన ప్రభుత్వాలు పరిశోధనా రంగాన్ని పూర్తిగా విస్మరించడమే కాక ప్రయివేటు వారికి ధారాదత్తం చేశాయి. చైనా లాగే మనకూ సంప్రదాయ వైద్యంలో మంచి పట్టు వుంది. కాకపోతే ఈ రంగంలోకి వ్యక్తిగత నమ్మకాలు (దేవుడు, దెయ్యం వంటివి) చొరబడ్డాయి. ముందుగా మనం విజ్ఞానంలోంచి ఛాందస భావాలను వేరుచేయాలి. ఆధునిక విజ్ఞానంతో ఆ అధ్యయనాలను సరిపోల్చుతూ శాస్త్రీయ అంశాలను జల్లెడ పట్టి బయటకు తీసుకురావాలి. 'తు యుయు' చేసిన పని అదే. మనకు ఇప్పుడు మూఢనమ్మకాలను పెంచిపోషించే, ప్రచారం చేసే నేతలు, ప్రభుత్వాలు కాదు కావాల్సింది. సంప్రదాయమైనా...ఆధునికతైనా... జనావళికి ఉపయోగపడేది ఏదని ఆలోచించే మావో లాంటి నేతలు, సంప్రదాయ మొక్క నుంచి మలేరియాను మటుమాయం చేసే ఔషధాన్ని తయారుచేసిన తు యుయు లాంటి శాస్త్రవేత్తలు కావాలి. అప్పుడే సామాన్యులకు మేలు జరుగుతుంది.

✦

మలేరియా మందుల ప్రస్థానం

మలేరియా క్రిమి పీచమణచడంలో పూర్వం నుంచి నేటి వరకు ఎన్నో ఔషధాలు కీలక పాత్ర పోషించాయి. చికిత్సకు మొదట క్వినైన్ వాడేవారు. సింకోనా చెట్టు బెరడు నుంచి ఈ మందును తయారు చేసేవారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జావాలోని డచ్ సింకోనా తోటలను జపనీయులు స్వాధీనం చేసుకోవడంతో క్వినైన్ కొరత తీవ్రంగా ఏర్పడింది. చైనాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 1940 వరకూ అదే ఔషధం వాడుకలో వుంది. ఆ తర్వాత మలేరియాపై దానికంటే మరింత శక్తిమంతంగా పనిచేసే క్లోరోక్విన్‌ను కనిపెట్టారు. 1970ల్లో మలేరియా పరాన్నజీవి ఆ మందును సైతం తట్టుకొని జీవించగలగడంతో మరో మందు అవసరమైంది. సల్ఫడాక్సైన్ - పైరిమీథమైన్ వాడకం మొదలైంది. అయితే కొంతకాలానికి పరాన్నజీవిని నిర్మూలించడంలో దీని శక్తి కూడా సరిపోకపోవడంతో మరో మందు అవసరమైంది. అదే ఆర్టెమైసినిన్. 1971లో 'తు యుయు' కనిపెట్టిన ఔషధం ఇదే.



మలేరియా పరిశోధనలకు నోబెల్

రోనాల్డ్ రాస్

దోమల ద్వారా వ్యాపించే ఒక రోగం మలేరియా. 50000 సంవత్సరాల క్రితం నుంచే మలేరియా మానవజాతిని పట్టి పీడిస్తోంది. క్రీపూ 2700 మొదలుకొని చైనాలో అనేకసార్లు మలేరియా వంటి జ్వరాలు వచ్చినట్టు ఆధారాలున్నాయి. ఉష్ణ మండల ప్రాంతాల్లో, చిత్తడి ప్రదేశాల్లో ఇది ఎక్కువగా వస్తుంది. మనిషి రక్తంలో పరాన్నజీవులు చేరినప్పుడు మలేరియా సోకుతుంది. ఆడ ఎనాఫిలిస్ దోమలు కుట్టడం ద్వారా వ్యాపిస్తుంది. జ్వరం, చలి, ఒళ్లునొప్పులు వంటి రోగ లక్షణాలతో రోగులను వేధిస్తుంది. ఈ వ్యాధి ఏవిధంగా వస్తుందో కనిపెట్టినందుకు ఫ్రెంచి రక్షణ రంగ వైద్యుడు చార్లెస్ లూయిా అల్ఫోన్సో లావెరెన్ 1907లో నోబెల్ అందుకున్నాడు. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రం, అది దోమలలో, మనుషులలో ఎలా నివసిస్తుందో తెలిపినందుకు రోనాల్డ్ రాస్ 1902లో నోబెల్ అందుకున్నాడు. ఈయన బ్రిటీష్ ఆర్మీలో సర్జన్‌గా పనిచేశాడు. ఇకపోతే మలేరియా వ్యాధిని నయం చేసే ఔషధం 'ఆర్టెమైసినిన్'ను కనుగొన్న ందుకు చైనా శాస్త్రవేత్త 'యుయు తు' ఏ ఈ ఏడాది నోబెల్ అందుకోనున్నారు.



లావెరెన్

అయ్యంగార్ ఇంటి వంటకాల్ని ఇపుడు ఆన్‌లైన్లో ఆర్డరిచ్చేయొచ్చు. కమ్మని ఫిల్టర్ కాఫీ కమ్మదనంతో.. కాదు వరస తప్పింది. ముందో స్వీట్ ముక్క, తర్వాత కారంతో కరకరలు చివరగా కాఫీతో పసందైన విందు లాగించేయొచ్చు. చెన్నైలోని ఓ చిన్న ఇల్లే కేంద్రంగా పదుల రుచుల్ని అందరికీ పంచుతోన్న ఈ-వంటశాల విజయ రహస్యం అందరికీ తెలిసిందే.

ఈ-ఇంటి వంట

భార్యభర్తలిద్దరూ ఉద్యోగాల్లో పూర్తి బిజీ. పండగకు అరిసెలెలా? పక్కింటి నుంచి గుబాళించే చక్రపొంగలి సువాసన కిటికీలు మూయనివ్వదు. ఇంటిల్లిపాదీ రుచి చూసేదెలా? షడ్రుచులతో కూడిన పూర్తి దక్షిణాది విందు చేసి ఎన్ని రోజులైందో? అన్ని వంటకాలు నేర్చేదెలా? చెన్నై ట్రిప్లికేన్ ఏరియాలోని బస్టాప్‌ల వద్దో, కూడళ్ల దగ్గరో, మార్కెట్ పక్కనో, సందుగొందుల్లోనో భార్యభర్తల డిస్కషన్ ఇదే. షాపుల్లో కొంటే ఇంటి వంటలా ఎందుకుంటాయి. కల్తీ ఎక్కువయ్యే చాన్స్. ఆరోగ్యానికి సరిపడవు. సగం మంది కొత్తగా పెళ్లయిన జంటలే కావడంతో గరిటె కష్టాలు యాడ్-ఆన్‌లు. ఇదంతా నిత్యం చూస్తూనే ఉండేవాడు బి.వెంకట రామకృష్ణన్. మేరిటైమ్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ అయిన ఆయనింట్లో ఈ తిప్పలు లేవు. పండగప్పుడే కాదు ప్రతి రోజు ఏదో ఒక వంటకం సెలబ్రేట్ చేసేస్తుంది. బయటవాళ్ల అర్రులు చాస్తోంది దీని గురించే కదా అని ఉద్యోగాన్ని వదిలి పాకశాల పాఠాలు మొదలెట్టేశాడు. 2011లో తన ఇంటి భోజనాన్ని పార్సిల్ చేసి అమ్మడం ప్రారంభించాడు. ఉల్లి, అల్లం లేకుండా అయ్యంగార్ కుటుంబం శైలిలో చేసే ఆ భోజనం ఘుమఘుమలు కొద్ది రోజుల్లోనే వందల ఇళ్లకు ప్యాక్ అయిపోయాయి. భార్య, మేనత్తలకు సహాయంగా పొరుగింటి మద్రాసీ మామీల ఇంటి వంటల్ని మెనూలో చేర్చాడు. అలా పూర్తిగా స్వచ్ఛమైన అయ్యంగార్ ఇంటి విందును తమ ప్రాంతంలో జిహ్వాచాపల్యమున్న వారందరికీ సప్లై చేసేశాడు. గట్టిగా ఆరు నెలలు తిరిగాయో లేదో కస్టమర్ లిస్టు 1000 దాటింది.

కేవలం భోజనంతో సరిపెట్టలేదు రామకృష్ణన్. వేటికోసమైతే పండగలు పబ్బాలు త్వరగా వచ్చేయాలని విందు ప్రియులు ఎదురుచూస్తుంటారో ఆ తీపి కారాలకూ ఆర్డర్లు తీసుకోవడం మొదలెట్టేశాడు. 2012లో అదీ దీపావళి సమయం చూసి. అంతే వారంలో 450 కేజీల స్వీట్లు అమ్మేశాడు. ఒకప్పుడు ఐదుగురు జట్టు కాస్త 30 మందికి చేరింది. వీరంతా గృహిణులే. వీలును బట్టి వారి వారి ఇళ్లలోనో లేదా అంతా కలిసి రామకృష్ణన్ ఇంటి వాకిలి పాకశాలగా మార్చుకునో నేయి కాగించేస్తారు. మద్రాసీ మామీలుగా పిలిచే వీరంతా ఒక్కో వంటకంలో ఒక్కో ప్రొఫెసర్ లాంటోళ్లు. రామకృష్ణన్ మేనత్తకు 85 ఏళ్లుంటాయి. కానీ ఈమె అరిసెలు చేసిందంటే పిల్లలు బుట్ట చుట్టూ గంతులు వేయాల్సిందే. ఇక చక్రపొంగలి, పాయసం, జాంగ్రీ, బాదం హల్వా, పాలకోవా లాంటి వాటి గురించి అయితే వేరే చెప్పక్కర్లేదు. అమ్మలంతా కలిసి 20 రకాల పచ్చళ్లు,



కారప్పొడులు, 30 రకాల స్వీట్లు, 10 రకాల పిండి వంటలు గ్రా రుచిగా శుచిగా తయారుచేసేస్తారు. వంటలంటేను అన్నీ ఒకేసారి కానే కాదు. ఆర్డర్ వచ్చిన ప్రకారమే. ముందే వండి వార్చేయరు. పావుకిలో అయితే పావుకిలో వరకే కావాల్సిన పదార్థాలను తీసుకుంటారు. మూడేళ్లు నిండాయో లేదో వీరి ఇంటి వంట అంతర్జాతీయ మార్కెట్‌ను అందుకోవడానికి కారణమిదే. మైలాపూర్, అడయార్, పెరంబూర్ వంటి ప్రాంతాల్లోనే కాక మారుమూల ప్రదేశాలకు వీరు పిండి వంటలు చేరిపోతున్నాయి. అక్కడి నుంచి ఉద్యోగాల నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లినవారూ వెంట తీసుకుపోవడంతో దూర ప్రాంతాల నుంచి ఆర్డర్లు వచ్చాయి. అలా ఇప్పుడు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, పూణె వంటి నగరాల కస్టమర్ల నోటినీ తీపి చేస్తున్నారు. విదేశాలకూ షిప్పింగ్ చేస్తున్నారు. ఇదంతా ఎలా అంటే ముందే చెప్పాంగా ఆన్‌లైన్ వేదికగా. స్వీట్‌కారంకాఫీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆర్డర్లు బుక్ చేసుకుంటున్నారు. మద్రాసీలు కూడా దీన్నే ఎక్కువ వాడటంతో వారి కోసం ప్రత్యేకంగాను పేజీలు కేటాయించారు. ఈ-మార్కెట్ ద్వారా రోజుకు 15 ఆర్డర్లు వరకు వస్తున్నాయి. వెబ్‌సైట్ పేరులో ప్రత్యేకత ఏమిటంటే పండగప్పుడు మీరు ఏ తమిళ ఇంటిలోనో విందుకు వెళితే తొలుత స్వీట్ తినిపిస్తారు. ఆ తర్వాత కారపు పదార్థాలు ఆ తర్వాత మాంచి ఫిల్టర్ కాఫీ ఇదీ వారి సీక్వెన్స్. దాన్నే వాడేశాడు రామకృష్ణన్. స్వచ్ఛమైన, కమ్మనైన ఇంటి వంటను రుచి చూపిస్తామంటూ చెప్పే ఆయన మాటలతో కాక వంటకాల ఘుమఘుమలతో ప్రచారం చేసేస్తున్నాడు. మీ ఇంటి వంటనూ ఇలా ఈ మార్కెట్‌తో ప్రపంచానికి రుచి చూపిస్తే ఏమో రామకృష్ణన్ కంటే వేగంగా హిట్ కొడతారేమో.

నవ్వుల్ – పువ్వుల్





పవిత్రమైన రోజు

పోలీస్: ఏరా!! ఈ వృత్తికి కొత్తా? బుద్ధి ఉన్న ఏ దొంగ వెధవైనా శివరాత్రి దొంగతనం చేస్తాడంట్రా?

దొంగ : నేను పరమ భక్తుడ్ని సార్, అందుకే పవిత్రమైన రోజని మొదలుపెట్టాను సార్!!

తాళి కట్టు పద్ధతి

మా వాడిని నిలబడి తాళి కట్టమంటున్నారు..! ఇదేం పద్ధతండీ?అడిగాడు పెళ్ళి కొడుకు తండ్రి.

అవునండి. మా అమ్మాయి వాళ్ల అమ్మ లాగే తల వంచదు. నేను నిల్చుని తాళి కట్టాను..! అన్నాడు పెళ్ళికూతురి తండ్రి.

టూత్ పేస్టు

తండ్రి: ఏరా మాటి మాటికి టూత్ పేస్టు పెట్టుకొని తోముతున్నావు?

కొడుకు: పేస్టు ట్యూబ్‌పై ఒక వారం లో పళ్ళు తెల్లబడతాయి అని ఉంది, నిజమా, కాదా అని టెస్టు చేస్తున్నాను నాన్నా.

కుట్లు



మీ ఆసుపత్రి స్పెషాలిటి ఏమిటి? అడిగాడు రాజు.

ఆపరేషన్ చేశాక మా డాక్టర్ కుట్లు వెయ్యరు..! చెప్పింది నర్సు.

మరి ఎవరు వేస్తారు...? అడిగాడు రాజు.

మా డాక్టర్ గారి ఫ్యామిలి టైలర్..? చెప్పి నాలిక్కరుచుకుంది నర్స్.

కొలత

కస్టమర్: ఏంటి ఆ ముసలాయనతో ఒకటే వివాదం?

సెలూన్ యజమాని : ఆయన లెక్కల టీచర్ అయ్యా, ప్రతీది లెక్క ప్రకారం చేయాలంటాడు!!

కస్టమర్: ఆయన చెప్పినట్లు చేస్తే గొడవ ఉండేది కాదు కదా!

సెలూన్ యజమాని: మీరు చూడలేదు ఆయన చేతిలో స్కేల్ వుంది, అంత జుట్టు స్కేల్ కొలతలతో సరిపోవాలంటారు

కస్టమర్: ఆ(.....

ఆరోగ్యం

రవి: ప్రతిరోజు వేకువజామున నాలుగు గంటలకు లేవడం, ఓ గంటపాటు పరిగెత్తడం నా ఆరోగ్యపు అలవాటు.

రాజు: ఇలా ఎప్పటి నుంచి చేస్తున్నావు?

రవి: వచ్చే సోమవారం నుంచి చేద్దామనుకుంటున్నా.

- చామర్తి వెంకటరామకృష్ణ

దొంగ దొంగ



మర్యాదగా అరవకుండా డబ్బులిచ్చెయ్ బెదిరించాడు దొంగ.

అరిస్తే ఏం చేస్తావ్? అడిగాడు సుందరం.

దొంగ దొంగా దొంగా అని అరిస్తే పోలీసులొస్తారు. వాళ్లకి నువ్వే మామూళ్ళు ఇచ్చుకోవాల్సి వస్తుంది! నీ ఇష్టం.

వెళ్ళిరండి

ఆ డాక్టర్‌ని నువ్వు చంపడానికి కారణమేమిటి? అడిగాడు జడ్జి.

నేను అసలే నెల రోజుల నుంచి ఆ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని ఎంతో డబ్బు తగలేసి ఇంటికొస్తుంటే వెళ్ళిరండి అన్నాడు అందుకే చెప్పాడు హంతకుడు.

రికార్డు

కొత్త గిన్నిస్ రికార్డుల పుస్తకం తయారైపోయింది. ఈస
కలిపి మరింత బరువెక్కింది. రికార్డులన్నీ ఓహ్ అనిపించి
విచిత్రంగా అనిపిస్తాయంటే అచ్చు తప్పు దొర్లిందని
సమాహారమిది

మంచు హోటల్ @ 25

స్వీడన్‌లోని యిక్కాస్యార్వీ మంచు హోటల్‌కు పేరు. శీతాకాలంలో అక్కడ గడ్డకట్టుకుపోయే టార్నీ నది నుంచి వేలాది మంచు గడ్డల్ని పెకిలించి ఈ హోటల్‌ను ఏ ఏటికాయేడు కొత్తగా కడుతుంటారు. 5500 చదరపు మీటర్ల మేర విశాలంగా దీన్ని ఎంతో అందంగా రూపొందిస్తారు. ప్రతి ఏటా కొత్త కాన్సెప్ట్‌లతో అవి చూడముచ్చటగాను కాసింత ఆశ్చర్యంగాను ముస్తాబు అవుతుంటాయి. ఓ సారి హాలీవుడ్ సినిమాలోని సై-ఫై వండర్లను ప్రతిబింబిస్తే, మరోసారి కార్టూన్ వాతావరణాన్ని తలపిస్తాయి. అయితే అవన్నీ స్వచ్ఛమైన మంచు వర్ణంలోనే. లండన్ ట్యూబ్‌ను పోలి సృజించిన కట్టడానికి మంచి మార్కులు పడ్డాయి. అప్పట్లో అదో సంచలనం. హోటల్ అంటే ఏదో నాలుగు రూములు కట్టేసి ఓ లాంజ్ ఏర్పాటు చేస్తే అయిపోయిందనిపించరు. ఓ చర్చి, బార్ వంటి సమస్త హంగు ఆర్భాటాల్ని మంచు గడ్డలతోనే రూపొందిస్తారు. అంత భారీ హోటల్ నిక్షేపంగా కొన్ని నెలల పాటు అతిథులకు సేవలందిస్తూనే ఉంటుంది. డిసెంబర్ నుంచి మార్చి వరకు ఈ హోటల్ తెరచి ఉంటుంది. ఇక్కడ గడిపేందుకు హోటల్ రూముల్ని కొన్ని నెలల ముందే బుక్ చేసేసుకుంటారు. వేసవి కాలం రంగప్రవేశంతో అంత కట్టడం కళ్లముందే కరిగి మళ్లీ టోరీ నదిలోకే మళ్లుతుంది. మళ్లీ కొన్ని నెలల తర్వాత తతంగం మళ్లీ ప్రారంభం. ఈ హోటల్‌ను ఇలా పాతికేళ్ల నుంచి నిర్వహిస్తూనే ఉన్నారు. అదే నండి మళ్లీ మళ్లీ కడుతూనే ఉన్నారు.

రోజుకు లక్షలు

అదే ఖరీదైన హోటల్ స్యూట్ విషయానికొస్తే జెనీవా వెళ్లాలి. హోటల్ ప్రెసిడెంట్ విల్సన్‌లోనిది రాయల్ పెంట్‌హౌజ్ స్యూట్ అది. దీనిలో ఆతిథ్యం స్వీకరించాలంటే ఒక్క రాత్రికి 50 లక్షల పైగానే వదిలించు కోవాల్సి ఉంటుంది. 12 బెడ్‌రూంలు, 12 మార్బుల్ బాత్రూంలతో ఉండే ఆ స్యూట్ ఏకంగా 18 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. జెనీవా సరస్సు, ఆల్ప్స్ పర్వత శ్రేణి ఇక్కడి నుంచి మహా గొప్పగా తిలకించొచ్చని హోటల్ వాళ్లు సెలవిస్తారు. అంత

డబ్బు ఒదిలించుకుని ఎవరుంటారా అంటే మైకేల్ డగ్లస్, బిల్‌గేట్స్ లాంటి వాళ్లు విడిది చేసినట్టు భోగట్టా. మరో హోటల్ ముచ్చట ఏమిటంటే, భారీ స్థలంలో బస చేసే వీలుండే స్టాండర్డ్ రూములున్న హోటళ్లు. చాలానే ఉన్నాయి కానీ నెవడా లాస్‌వెగాస్‌లోని వెనేషియన్ హోటల్ అండ్ కేసినో ముచ్చటే వేరు. 65 చదరపు మీటర్ల వైశాల్యంలో ఉండే గదులు ఇక్కడ ప్రత్యేకత.

పేద్ద ఇమానం

ప్రపంచంలోనే అతి భారీ పాసెంజర్ విమానం ఏంటని అడిగితే టక్కున బోయింగ్-747-8 ఇంటర్‌కాంటినెంటల్ అని చెప్పేయండి. ఎక్కువగా లుఫ్తాన్సా వారు నడిపే ఈ విమానంలో ఏకంగా 467 మంది ప్రయాణీకులు హాయిగా వెళ్లొచ్చు. 76 మీటర్ల పొడవుండే ఈ విమానం టేక్ ఆఫ్ బరువు ఏకంగా 4 లక్షల 47 వేల కిలోలు. 2011 మార్చి నుంచే అందుబాటులోకి వచ్చిన దీని సేవల్ని అట్లాస్ ఎయిర్, ఎయిర్ చైనా వంటి విమానయాన సంస్థలూ వినియోగిస్తుంటాయి. విమానయానమంటే గుర్తొచ్చింది మధ్యలో ఎక్కడా ల్యాండ్ అవకుండా ఏకబిగిన సాగిన దూరప్రయాణం 2005 నవంబర్ 9, 10 మధ్యన జరిగింది. హాంగ్‌కాంగ్ నగరం నుంచి లండన్ వరకు 21,601 కిలోమీటర్ల దూరం బోయింగ్ 777-200ఎల్ఆర్ అనే విమానంలో సాగిందా ప్రయాణం. 22 గంటల 42 నిమిషాలు ఆ ఫ్లైట్ ప్రయాణ కాలం. మరో ప్రత్యేకాంశమేమిటంటే ఆకాశ మార్గాన కూడా దానికి రీ-ఫ్యూయల్ చేయలేదు. ఇలాంటి మరెన్నో అద్భుతమైన, నమ్మశక్యం గానీ రికార్డులతో 2016 ఎడిషన్ గిన్నిస్ రికార్డు బుక్ తయారైపోయింది. పుస్తకం చదివే వీలు చిక్కితే అస్సలు వదలకండి. బోలెడు విచిత్రమైన రికార్డులు పొందుపరుచుకుంది కొత్త ఎడిషన్.



..ల మోత

..గారి మరిన్ని ప్రపంచ రికార్డులతో, పాత గమ్మత్తులతో
..నా కొన్ని మాత్రం నమ్మశక్యం కానివీ ఉంటాయి. ఎంత
.. అనుకుంటారు కొందరు. వాటిలో కొన్ని విశేషాల
..

తిండి గొప్పలు

ప్రపంచ రాజధానిగా కాస్మోపాలిటన్లు పిలుచుకునే అతి ఖరీదైన విశ్వనగరం న్యూయార్క్ సిటీలోనైన పొట్ట నింపుకోవచ్చు కానీ లండన్ మాటే ఎత్తొందంటున్నారు స్థానికులు. ఓ యావరేజీ హోటళ్లో మూడు కోర్సుల భోజనం, ఓ గ్లాసు వైన్ కలిపి అక్కడ అక్షరాలా 6400 రూపాయల్ని బేరర్‌కు అప్పజెప్పిరావాలి. ఇది న్యూయార్క్‌సిటీ రేట్లతో పోలిస్తే రెండు రెట్లు. అలాంటి చోట అతి ఖరీదైన విందు లాగించేసిన మిత్ర బృందం ఒకటి ఉంది. ఆరుగురు కలిసి ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం నేటి లెక్కల్లో 36 లక్షల రూపాయల బిల్లు చేసేశారు. ఇది నిజం నమ్మండీ, బిల్లులోని చాలా భాగం కేవలం 5 వైన్ బాటిళ్ల వల్ల పేలిపోయింది. తిండికి, నీటికి, జ్యూస్‌లకు, ఆరు గ్లాసుల షాంపెయిన్, సిగరెట్లకు కలిపి 40 వేలే తగలెట్టారు. కానీ, వైన్ విషయానికి వచ్చేసరికి గొంతు ఆరిపోతుంది. ఈ 40 వేలు పోగా మిగతా మొత్తం మందుకే ఖర్చయిపోయింది. ఈ తిండిగొప్పలు లండన్‌లో జరిగిపోయాయి. బెల్‌గ్రేవియాలోని గోర్డాన్ రామ్సేస్ పెట్రస్ రెస్టారెంట్‌లో విందు చేసిన ఈ మిత్రబృందం 1947 నాటి చటే పెట్రస్ వింటేజీ క్లారెట్‌ను ఆర్డరిచ్చారు. పాత వైన్‌కు ఖరీదెక్కువంటే నమ్మలేదు మరీ ఇంత అంటే వామ్మో అనిపించకమానదు.

ఆకాశపాతం



ఏంజెల్స్ ఫాల్స్ పడే చోట మీరుంటే నీరంతా ఆవిరి మబ్బులా తగులుతున్నట్టు కొత్త అనుభూతిని మిగులుస్తుంది. ఎందుకంటే ఏంజెల్స్ ఫాల్స్ ఎత్తు 979 మీటర్లు (3211 అడుగులు). సాల్టో ఏంజెల్‌గా స్థానికంగా పిలుచుకునే ఈ అబ్బురం వెనెజులాలోని బొలీవర్‌లో ఉంది. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే ఎటువంటి అడ్డు లేకుండా నేరుగా 807 మీటర్ల పైనుంచి నీరు నేలను తాకుతుంది. చాలా వరకు నీరు కిందకు చేరేలోగా గాలి ఒరిపిడికి ఆవిరిలా మారుతుంది. మంచు పరుచుకున్నట్టు అవుతుంది. ఈ జలపాతం ఉనికి బయటి ప్రపంచానికి తెలిసింది జిమ్మీ ఏంజెల్ అనే అమెరికన్ పైలెట్ ద్వారా. బొలీవర్ అటవీ ప్రాంతం మీదుగా చక్కర్లు కొడుతున్న ఏంజెల్‌కు ఈ జలపాతం ఎదురుపడే సరికి నోరెళ్లబెట్టేశాడట. 1933 నవంబర్ 16న ఈ సంగతి ఆయన తన లాగ్ బుక్‌లో రాసుకున్నాడు.



సముద్రానికి రంధ్రం



ఒకప్పుడు ఖాళీగా ఉండి ఆ తర్వాత సముద్రపు నీరు చేరిన గుహల్నే బ్లూ హోల్స్ అంటారు. ఒడ్డుకు దగ్గరలో సముద్రమట్టం కన్నా కాస్త దిగువగా ఉండే ఈ ప్రాంతాల్లో కాలక్రమంలో నీరు చొచ్చుకుని వస్తుంది. వీటిని ఇట్టే గుర్తు పట్టేయొచ్చు. వీటి దగ్గర నీరు మిగతా సముద్రపు నీరు కన్నా ఎక్కువ నీలం రంగులో ఉంటాయి. వీటితో ప్రమాదం ఏమిటంటే ఈతరానివాళ్లు ఒడ్డే కదా అని అడుగేస్తే పదుల మీటర్ల లోతుకు మునిగిపోతారు. గుహలు కావడం వల్ల వీటిల్లో పడి తప్పిపోవడం కూడా జరగొచ్చు. ఎలా అంటారా అయితే బహమాస్‌లోని టర్టుల్ కోవ్ దగ్గరున్న డీన్స్ బ్లూ హోల్ గురించి చెప్పాల్సిందే. అట్లాంటిక్ సంద్రాన ఉండే దీని లోతు ఏకంగా 202 మీటర్లు. వెడల్పు 76 మీటర్లు. క్లారెన్స్ పట్టణం దగ్గరలో ఇది ఉంది.

77 అంతస్తుల హోటల్

మరిన్ని హోటళ్ల విషయానికొస్తే ప్రపంచంలో అతి ఎత్తైన హోటల్ జెడబ్ల్యు మారియట్ మార్కిస్ దుబాయ్. 355 మీటర్లు ఎత్తుండే ఈ నిర్మాణం రెండు భవంతులతో కలిసి ఉంటుంది. తొలుత ఎమిరేట్స్ పార్క్ టవర్స్ హోటల్ అండ్ స్పాగా దీన్ని 2012 నవంబర్ 11న తెరిచారు. మొత్తం 77 అంతస్తులుంటాయి. దుబాయ్ నగరంలోని చాలా వ్యాపాయింట్లను ఈ హోటల్ కవర్ చేస్తుంది.

అందరికీ అమ్మ

రంగస్థలమే ఆమె పాఠశాల.
రంగస్థల కళాకారులే ఆమెకు ఆత్మ బంధువులు.
నచ్చిన పాత్రలతోనే ఆమె సహజీవనం.
ఇండస్ట్రీలో చిన్నా పెద్ద అందరి చేత 'అమ్మ'
అని పిలువబడే ఏకైక అమ్మ – నిర్మలమ్మ!

ఆంధ్రదేశం నలుమూలల నుండీ ఏ రంగస్థల కళాకారుడు వచ్చినా ఆమె ఇంట ఎంగిలి పడాల్సిందే. ఉన్నంతలో సర్దుకు తినడం, చాప ఉన్నంత వరకే కాలు చాపుకోవడం, ఈర్ష్యా ద్వేషాలకు అతి దూరంగా ఉంటూ అందర్నీ తన బిడ్డల్లా చూసుకొనే మనస్తత్వం నిర్మలమ్మది. సినిమాల్లో ఎంత బిజీగా వున్నా, ఎక్కడైనా నాటకాలు జరుగుతున్నాయని తెలిస్తే తప్పకుండా హాజరు కావాల్సిందే. పసిపాపలా కేరింతలు కొట్టాల్సిందే. కృష్ణా జిల్లాలో మచిలీపట్నం మహామహులు పుట్టిన గడ్డ మీద ఫిబ్రవరి 1927లో జన్మించిన నిర్మలమ్మ వదినగా, అమ్మగా, అమ్మమ్మగా 800 సినిమాల్లో నటించిందంటే ఆమె నటనాతృష్ణని అర్థం చేసుకోవచ్చు. కొన వూపిరి ఉన్నంత కాలం నటించాలని కోరుకున్న ఈమె తన పంతం నెరవేర్చుకుంది.

ఎన్నో బాలారిష్టాలు

నిర్మలమ్మ అందగత్తె అనే విషయం పాత సినిమాలు గరుడ గర్వభంగం(1956), పాదుకా పట్టాభిషేకం, భార్యభర్తలు, కులగోత్రాలు, దేవత, పొట్టి ప్లీడరు ఇత్యాది చిత్రాలు చూస్తే అర్థమవుతుంది. ఆమె సినిమాల కోసం ఏనాడు వెంపర్లాడలేదు. తొలి రోజుల్లో వేషాలు గగనమైపోయాయి. సాటి నటీమణులు అంజలీ దేవి, సావిత్రి, జమున, కృష్ణకుమారిలతో పోటీపడలేదు. అలాగని ఆమె పర్సనాలిటీకీ తగ్గ పాత్రలు ఎవ్వరూ సృష్టించే వారు కాదు. ఆ సమయంలో నాటక రంగమే ఆమె ప్రపంచం. రంగస్థల కళాకారులే ఆమె సర్వస్వం. ఎక్కువగా చదువుకోకపోయినా మనుషుల్ని ప్రపంచాన్ని బాగా చదివింది. అందుకే ఉత్తరోత్తరా సినీ ప్రపంచానికి అంత దగ్గరయ్యింది.

'మనుషులు మారాలి' మార్చింది

ఆ రోజుల్లో విక్టరీ మధుసూదన్ నిర్మాతగా 'మనుషులు మారాలి' చిత్రం ఆమె నటనా జీవిత గమనాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ చిత్రంలో శారద, శోభన్ బాబులకు ఎంత పేరొచ్చిందో నిర్మలమ్మకీ అంతే పేరొచ్చింది. చదువు సంధ్యలు తెలియని అమాయకపు పల్లెటూరి అమ్మమ్మ పాత్ర అది. భావోద్వేగాల్ని ఆపుకోలేక తనలో తానే గొణుక్కొనే పాత్ర అద్భుతంగా పోషించింది. తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని నిర్మాత దర్శకుల దృష్టి ఆ పాత్ర మీద పడింది. వరుసగా ఆఫర్లు తన ముంగిట వాలాయి. యమగోల, చిల్లర కొట్టు చిట్టెమ్మ, పదహారేళ్ళ వయసు, శివరంజని, కోతల రాయుడు, శంకరాభరణం లాంటి విజయవంతమైన చిత్రాల్లో నటించింది.

'దాసరి' ప్రోత్సాహం

ఆ రోజుల్లో దాసరి నారాయణరావు ఏడాదికి కనీసం 16 సినిమాలు చేసేవాడు. ఆ పదహారు సినిమాల్లోనూ నిర్మలమ్మ ఉండి తీరాల్సిందే. ఒక నటిగా కాకుండా కుటుంబ సభ్యురాలిగా కలిసిపోయేది. ఒక్క దాసరే కాదు దాసరి స్కూలు నుంచి వచ్చిన ప్రతి దర్శకుడూ ఆమెను అలాగే గౌరవించేవారు. తన గౌరవాన్ని తాను కాపాడుకోవడంలో ముందుండేది. సెట్‌లో లైట్ బోయ్ నుంచి జూనియర్ ఆర్టిస్టు దాకా అందర్నీ ఆప్యాయంగా పలకరించే అరుదైన వ్యక్తిత్వం ఆమెది. పేదింటి పెళ్ళి పెద్దగా నిలిచేది. ఎంతటి స్టార్ డమ్ సంపాదించినా తొలిరోజులు మరిచిపోలేదు. అందుకే అంత కాలం తన ఉనికిని

కాపాడుకోగలిగింది. నిర్మలమ్మకి గ్రాహక శక్తి ఎక్కువ. డైలాగ్ ఒకసారి వింటే వెంటనే తిరిగి చెప్పేసేది. టేక్ అనేసరికి మాడ్యులేషన్‌తో సైతం సహజంగా చెప్పి క్లాప్స్ కైవసం చేసుకొనేది.

అగ్రతారలకు అభిమానపాత్రురాలు

ఎన్టీఆర్, ఎ.యన్.ఆర్‌లు సెట్‌లో వుంటే వారి పెద్దరికాన్ని అమితంగా గౌరవించేది. వెంకటగిరి జరీ చీర పైట చుట్టూ కప్పుకుని హుందాగా కూర్చునేది. రండి నిర్మలమ్మ గారూ! అంటూ ఎన్టీఆర్ సాదరంగా ఆహ్వానించేవారు. ఎ.యన్.ఆర్. సూర్యకాంతమ్మని పిలిచినట్లే అక్క అని సంబోధిస్తూ నిర్మలక్క అనేవాడు. నిర్మలమ్మ వారిద్దర్నీ అభివర్ణిస్తూ తెలుగు ఫిలిం ఇండస్ట్రీకి రెండు కళ్ళు అనేది. ఇక సావిత్రమ్మ విషయానికొస్తే మూగబోయేది. నిర్మలమ్మ బిజీగా వున్న సమయంలో 80-90లో సావిత్రమ్మ కెరీర్ చివరి దశలో ఉంది. అది నిర్మలమ్మ భరించలేకపోయేది. "ఎవరుంటారండీ అంత గొప్పనటి? ఎవరు చేయగలరండీ అంత గొప్ప నటన? ఆ కళామతల్లి సావిత్రమ్మ రూపంలోనే ఉంది. మా అందరికీ ఎలా నవ్వాలో ఎలా ఏడ్వాలో, ఎలా డైలాగు చెప్పాలో.. తేలిగ్గా ఎంత గొప్ప నటన ప్రదర్శించవచ్చో తెలియచెప్పింది. అటువంటి సావిత్రమ్మకు అవకాశాలు రాకపోవడం తెలుగు సినిమా చేసుకున్న దౌర్భాగ్యం!" అంటూ కంటతడి పెట్టేది. ఇది గమనించిన సావిత్రమ్మ బాధగా నవ్వేస్తుండేది.

కృష్ణారెడ్డి, ఈవీవీలకూ అమ్మే

ఆ రోజుల్లో యస్వీ కృష్ణా రెడ్డి, ఈవీవీల మధ్య పోటీ తీవ్రంగా ఉండేది. అంత పోటీ ఉన్నా ఇద్దరూ అభిమానించే అరుదైన నటి నిర్మలమ్మ. ఇంచుమించు ఇద్దరి చిత్రాల్లోనూ వుండేది. మాయలోడు, మావి చిగురు, ఎగిరే పావురమా, పండగ, ఆహ్వానం లాంటి చిత్రాల్లో అద్భుతమైన పాత్రలు పోషించింది. ఈవీవీ చిత్రాల్లో అరుదైన హాస్య పాత్రల్ని పోషించింది. ఆలీబాబా అరడజను దొంగలు, జంబ లకిడి పంబ లాంటి చిత్రాల్లో నిర్మలమ్మ చిలిపి నటన మరిచిపోగలమా!

చిరంజీవికి మేనత్తలా!

చిరంజీవితో సహనటిగా ఎక్కువ సినిమాలు చేసిన క్రెడిట్ నిర్మలమ్మకే దక్కింది. పట్నం వచ్చిన పతివ్రతలు, శుభలేఖ, సంఘర్షణ, మంత్రి గారి వియ్యంకుడు, మగ మహారాజు, ముగ్గురు మొనగాళ్ళు, మహానగరంలో మాయగాడు, గ్యాంగ్ లీడర్ లాంటి చిత్రాల్లో నిర్మలమ్మ నటన అద్భుతం. చిరంజీవి కూడా ఆమెతో చనువుగా ఉండేవాడు. 'మా మేనత్త కూడా నిర్మలమ్మలాగే ఉంటుంది. అందుకే అంత చనువుగా సహజంగా నటించగలుగుతున్నా' అంటూ తన మనసులో భావాన్ని ఓ సందర్భంలో బైటపెట్టాడు.

చిరంజీవి, సుమలత, తులసితో...

నాటకాలంటే ప్రాణం

వయసుపైబడుతున్నా కూడా ఎక్కడినుంచైనా పరిషత్ పోటీలకు ఆహ్వానం వస్తే ఎలాగైనా తీరిక చేసుకొని వెళ్ళేది. ఒకరోజు చూసొద్దామని వెళ్లే ఆమె పరిషత్ మూడు రోజులూ ఉండిపోయేది. మెప్పించిన నటుడు, నటికి గాని బహుమతి రాకపోతే ఇల్లు పీకి పందిరేసేది. వారికి ఎందుకు ప్రథమ బహుమతి ఇవ్వాలో వారి మెళుకువల్ని వివరించి తెలియచెప్పేది. ఇలా చెప్పడంలో ఆమె రంగస్థల అనుభవాలు అపారం. సినిమాలు లేని తీరిక సమయాల్లో ఇంట్లో రంగస్థల కళాకారులతో మాటామంతితో నాటక రంగ గొప్పతనాన్ని వివరించేది. పేద కళాకారుల్ని ఆదుకోవడం ఆమె నిత్యకృత్యం. 'నాకు పిల్లల్ని భగవంతుడు ఎందుకివ్వలేదో ఇప్పుడర్థమవుతోంది. పిల్లలుంటే నాలో స్వార్థం పెరుగుతుంది. వారికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు వీళ్ళంతా నా పిల్లలే. బ్రతికున్నంత కాలం వీరందరూ నాతో వుంటారు.' అంటుండేది. నిర్మలమ్మ చెప్పినట్లే కళాకారులందరూ నిర్మలమ్మ కొనవూపిరున్నంత కాలం వెంటే ఉన్నారు.

వజ్రోత్సవాల్లో అద్భుత దృశ్యం

ఆఖరుసారిగా హాజరైన తెలుగు సినిమా ఫంక్షన్ వజ్రోత్సవాల సందర్భంగా.. అదీ చిరంజీవి ఆహ్వానం మేరకు వచ్చిన ఆమె తన అమ్మదనాన్ని అదే వేదికగా పంచిన దృశ్యం ఎవరూ మరువలేరు. అప్పటికే నడవలేని స్థితిలో.. చూపు సరిగ్గా ఆనేది కాదు. అయినా కనిపించిన, వినిపించిన వారందర్నీ పలకరించింది. ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది. తెలుగు సినిమాకి డెబ్బై అయిదేళ్ళు నిండడం.. ఇంత వైభవంగా వేడుక జరుపుకోవడం తెలుగు సినిమాకి ఆ భగవంతుడిచ్చిన వరం అంది. అలాగే 'నాకు మరో జన్మంటూ వుంటే మళ్ళీ కళాకారిణిగానే పుడతాను. హీరోయిన్‌గా కాక అమ్మగానే ప్రేమను పంచుతాను. అమ్మగానే ఎన్ని జన్మలెత్తినా అందరి గుండెల్లో నిలిచిపోతాను' అంది.

- ఇమంది రామారావు

అందుకున్న బహుమతులతో...

వైజయంతితో..

బొమ్మలాంటి జీవితం

అనాస్తేసియా రెస్నోస్ (20), క్వెంటిన్ డెహార్ (23) అనే ఫ్రెంచ్ ప్రేమికులిద్దరూ మరో విషయంతోను కలిసి ప్రేమలో పడ్డారు. బొమ్మలంటే చిన్నప్పటి నుంచి పిచ్చే కాదు ఎంత ఖర్చు అయినా వాటిలా మారిపోవాలని నిర్ణయించుకున్నారు. బార్బీ, కెన్ బొమ్మల్లా తమ దేహాల్ని మార్చుకునేందుకు ఇద్దరూ కలిసి ఇప్పటివరకు 11 ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకున్నారు. రష్యా నుంచి వచ్చి పారిస్‌లో సెటిల్ అయిన అనాస్తేసియా 17 ఏళ్లప్పుడే బార్బీ ముక్కును పోలేలా సర్జరీ చేయించుకుంది. ఆ తర్వాత ప్లాస్టిక్ ఇంప్లాంట్స్ వాడి మిగతా శరీర భాగాల్ని బార్బీని పోలే కొలతల్లోకి మార్చుకుంది. వీటన్నింటికీ డబ్బును వారి తల్లిదండ్రులే సర్దడం ఆశ్చర్యం. క్వెంటిన్ కూడా కెన్‌లా కనిపించేందుకు ముక్కుకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. బొటాక్స్ కూడా చేయించుకుని ముఖాకృతిని మార్చుకున్నాడు. పలు రకాల శస్త్ర చికిత్సలే కాక చివరకు వారి జీవనశైలి కూడా బార్బీ, కెన్‌ల మాదిరి చాలా ఖరీదుగా గడిపేస్తున్నారు. ఏమాత్రం అడ్డు చెప్పకుండా లక్షల విలువ చేసే పర్సుల్ని కొనిచ్చి మరీ ముచ్చట పడిపోతున్నారు వారి తల్లిదండ్రులు.

వింత లోకం

పెంచిన ప్రేమ

పెంపుడు జంతువులంటే ప్రాణం పెట్టే వాళ్లను చాలా మందిని చూస్తుంటాం. ఆ వర్గానికి చెందినదే సెర్బియా మహిళ టాంజా జంకోవిక్. తన పెంపుడు కుక్క లియోకు చికిత్స చేయించేందుకు తన గూడుకు కూడా అమ్మేందుకు సిద్ధపడింది. ఆరోటిక్ వాల్వ్ స్టెనోసిస్ అనే ధమనుల వ్యాధి బారిన పడిన లియోకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు చెప్పడంతో దానికి డబ్బు సేకరించే పనిలో పడింది. పెద్ద మొత్తం కావడంతో చివరకు జాగోడినా సిటీలోని తన సింగిల్ బెడ్రూమ్ అపార్ట్‌మెంట్‌ను అమ్మేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న కొందరు పెద్ద మనసు చేసుకుని లియో వైద్యానికి డబ్బు అందించారు.

ఒంటరి కాపురం

మార్టిన్, సిన్‌ఫోరోసా కొలోమెర్ దంపతులిద్దరూ 45 ఏళ్లుగా ఓ ఖాళీ ఊరిలో ఒంటరి కాపురముంటున్నారు. స్పెయిన్‌లోని లా ఎస్ట్రెల్లా అనే గ్రామంలో ప్రస్తుతముంటున్న ఇద్దరు పౌరులూ వీరే. పక్క ఊరు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఒకప్పుడు లా ఎస్ట్రెల్లా వైభవంతో వెలిగిపోతుండేది. కోటీశ్వరులు వారి భార్యల కోసం ఇక్కడ విడిది భవంతుల్ని ఎంతో విలాసవంతంగా కట్టించారు. 1883లో వచ్చిన తుఫానుతో ఈ ప్రాంతంలో నివాసమున్న సగం మంది చనిపోయారు. అప్పటి నుంచి ఒక్కొక్కరూ ఆ గ్రామాన్ని విడిచివెళ్లడం మొదలెట్టారు. ఆ వూరి పొలంలో తొలిసారి సిన్‌ఫోరోసాను చూసిన మార్టిన్ వెంటనే ప్రేమలో పడిపోయాడు. వారివురూ వివాహం చేసుకుని ఓ ఆడపిల్లకు జన్మనిచ్చారు. 12 ఏళ్ల వయసున్నప్పుడు ఆమెకు తలకు గాయమై చనిపోయింది. అప్పటికే ఊరు చాలావరకు ఖాళీ అయిపోయింది. తమ ప్రేమకు గుర్తు అయిన ఊరు, తమ కూతురు జ్ఞాపకాల్ని పెనవేసుకున్న ఊరు కావడంతో దాన్ని విడిచివెళ్లలేక వారు ఒంటరిగానే అక్కడ ఉండిపోయారు. విద్యుత్, మంచి నీరు, ఫోన్ వంటివి లేకపోయినా హాయిగా అక్కడే గడిపేస్తున్నారు. వారికి తోడుగా 3 కుక్కలు, 25 పిల్లులు కుటుంబంగా మారాయి. ఓ పాత కారులో అప్పుడప్పుడు పక్క ఊరు వెళ్లి కావాల్సిన నిత్యావసరాల్ని కొనుక్కుంటారు.

వాహ్.. కారం

ముద్దలో తెలీక ఒక మిరప ముక్కను కొరికారంటే చాలు గ్లాసెడు నీళ్లు గటగటా తాగేసి ఛీంకారాన్ని తీసేవాళ్లను చూస్తూనే ఉంటారు. చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లోని కింగ్ ఆఫ్ చిల్లీని కూడా ఓ సారి చూడండి మరి. రోజుకు రెండుంబావు కిలోల మిరప కాయల్ని లాగించేస్తాడు 48 ఏళ్ల లీ యోంగ్జీ. దంత దావనం కూడా మిరపకాయలతోనే. తన జిహ్వా చాపల్యం తీర్చుకునేందుకు తన ఇంటి పెరట్లో 7 రకాల మిరపకాయల్ని పండిస్తున్నాడు. ఇలా కారం రుచి మరగడానికి ఓ బలమైన కారణం ఉంది. అంతంత మాత్రం సంపాదనపరుడైన లీకి తన కొడుకు అనారోగ్యం ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతీసింది. ఎన్నో ఆకలి రోజుల్ని గడిపాక ఓసారి కడుపు మంటకు అల్లాడలేక తినడానికి ఇంట్లో ఏమి దొరక్కపోవడంతో డబ్బాలోని కారాన్నంతటినీ తినేసి కడుపు నిండా నీళ్లు తాగేశాడు. ఏమి జరగ్గపోవడంతో అప్పటి నుంచి మిరపకాయల్ని చిరుతిండిగా మార్చేసుకున్నాడు. అలా భోజనంలోను వాటి వాటా పెంచేశాడు. అతడి అభిరుచికి తగ్గట్టు కింగ్ ఆఫ్ చిల్లీస్ అనే టైటిల్ ఇచ్చేశారు ఊరి వాళ్లు.

లఘుచిత్రం



స్వామీజీ బిజినెస్

కొందరికి సినిమాలు తీయాలనే కోరిక ఉంటుంది. వెండితెరపై తమ పేరు చూసుకోవాలనే అభిలాష ఉండటం సహజమే.కానీ సామాజిక దృష్టి గల లఘు చిత్రాలు తీసి సినిమా రంగంలోకి వెళ్లడం సామాన్యమైన విషయం కాదు. అలాంటి చిత్రాలు తీయాలంటే ముందు ధైర్యం కావాలి. అంతేకాదు. అందులోనే మళ్ళీ చక్కని సందేశం ఇవ్వాలంటే ఎంతో సృజన కూడా ఉండాలి. నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢనమ్మకాలపై తీసిన చక్కని లఘు చిత్రం "స్వామిజీ". దర్శకుడు ఫణి మోరంపూడి దీన్ని ఎంతో సృజనాత్మకంగా తెరకెక్కించాడు.

12 నిమిషాల నిడివి గల ఈ చిత్రంలో సామాన్యుడి నుండి ఉన్నత చదువులు చదువుకున్న మేధావుల వరకు అందరు గుడ్డిగా ఈ బాబాలను, స్వామిజీలను ఎలా నమ్ముతున్నారో చిత్రంలోని పాత్రల ద్వారా చెప్పిస్తాడు. దర్శకుడు సమాజంలో బాగా పాతుకుపోయి ఉన్న ఈ రుగ్మతను వాళ్ళు ఎలా సొమ్ము చేసుకుంటున్నారో కూడా తెలియచేస్తాడు. అంతే కాకుండా డబ్బు సంపాదించడం కోసం యువత వెతుకుతున్న సులభమైన మార్గం దొంగతనాలు చేయడం... ఆ సీన్ తోనే ప్రారంభమవుతుంది ఈ చిత్రం. ఈ చిత్రంలోని సంభాషణలు ఆద్యంతం ఆలోచింపచేస్తాయి. బ్రాండెడ్ కంపెనీలు అయితే బేరాలు ఉండవు. ఫిక్స్‌డ్ రేట్లు.. అదే రోడ్డు పక్కన తన బతుకుదెరువు కోసం చేసుకునే చిరు వ్యాపారుల దగ్గర మాత్రం గీసి గీసి బేరం ఆడుతుంటారు. అలాంటి వారిని ప్రశ్నించే విధంగా ఉంటుంది. 'సొసైటీలో అంతో ఇంతో నిజాయితీగా సంపాదించేది ఇలాంటి వాళ్ళేరా. వాళ్ళను కూడా బతకనియ్యండి రా' అని ఒకరితో చెప్పిస్తాడు. ఇంజనీరింగ్ చదివినా ఉద్యోగాలు రాక యువత అనేక పెడదారులు పడుతోందనే విషయాన్ని తెలియజేస్తూ ... అందులోనే పెట్టుబడి లేకుండా డబ్బు సంపాదించడం కోసం ఉన్న ఏకైక బిజినెస్ స్వామిజీ బిజినెస్... అని మాటలు ప్రజలు ఎంత గుడ్డిగా స్వామీజీలను నమ్ముతున్నారో తెలియజేస్తాయి. అంతే కాదు. తమను ఎదిరించిన వాళ్ళను ఈ బాబాలు, స్వామీజీలు ఏ విధంగా లొంగదీసుకుంటారో కూడా తెలియజేశాడు దర్శకుడు.

"ఈ జనం ఆకలేసిన వాడికి అన్నం పెట్టరు గానీ దోచుకునేవాళ్లకు దండం పెడతారు" అనేది ఈ చిత్రానికి హైలెట్ డైలాగ్. అలాగే "అవకాశాలు రావాలే కానీ అడుక్కునేవాడు కూడా అంబానీ అవుతాడు"

"తప్పు చేసేవాడే ఈ సొసైటీలో తల ఎత్తుకొని తిరుగుతున్నాడు"

"ఈ సొసైటీలో మనీ ఉన్న వాడినే మనుషులుగా చూస్తారు. మనసు ఉన్నోడితో ఈ సమాజానికి పని లేదు" అన్న డైలాగులు వాస్తవానికి చాలా దగ్గరగా వుంటాయి.

"ప్రతి మనిషి బతకడానికి క్యాష్ కావాలని ...క్యాష్ అంటే డబ్బు కాదని

k-knowledge

A-Attitude

S-Skills

H-Humanity

అని స్వామిజీ చేత చెప్పిస్తాడు దర్శకుడు.

ఈ చిత్రానికి బుచ్చిబాబు అందించిన "మనసే దైవంగా ఎంచవు ఎందుకురా" అనే పాట చక్కగా సరిపోతుంది. ప్రజలను నమ్మించడం కోసం ఆశ్రమాలను కట్టించడం... ఆ తరువాత వచ్చిన సొమ్ములు దాచుకోవడం జరుగుతుంది. నేడు ఆశ్రమాల పేరుతో అనేక అసాంఘిక కార్యకలపాలకు స్వయంగా ఈ బాబాలే పాల్పడుతున్నారు. ఇప్పటి వరకు ఈ చిత్రాన్ని సుమారు 2000 మంది చూశారు. ఈ ఉత్సాహంతో దర్శకుడు ఫణి మోరంపుడి మరో చక్కని సందేశాత్మక చిత్రం "బాపుగారి బొమ్మ"ను తెరకెక్కిస్తున్నాడు.

యు ట్యూబ్ లింక్:
https:youtu.be/jtfusjmb6gu

- ప్రియ మోహన్
9948525363

ఆహ్వానం

యూ ట్యూబ్‌లో వేలాది లఘు చిత్రాలు హల్‌చల్ చేస్తుంటాయి. 'చైతన్యం కలిగిస్తాయి. ఆలోచన రేకెత్తిస్తాయి. మూఢ నమ్మకాలపై కనువిప్పు కలిగిస్తాయి' అనుకున్న షార్ట్ ఫిల్మ్స్ గురించి రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: స్నేహ, షార్ట్ ఫిల్మ్ హౌస్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2

ఇ-మెయిల్: snehaweekly.praja@gmail.com

పరివర్తన

కె.శ్రీనివాస శాస్త్రి

◆ కథ

"నేను నా పుట్టింటికి వెళ్తున్నాను" అని సూట్‌కేస్ తీసుకుని ప్రయాణానికి సిద్ధమైంది దుర్గ.

ఎందుకు వెళ్తున్నావ్? ఎప్పుడు తిరిగి వస్తావ్?

అని రాజు ఆమెని అడగలేదు. ఎందుకంటే ఆమె తన మీద అలిగినప్పుడు పుట్టింటికి వెళ్ళి తన ఇష్టం వచ్చినప్పుడు తిరిగి రావడం ఇంతకు ముందు చాలా సార్లు జరిగింది. అది అతనికి కొత్తేం కాదు. ఆ సమయంలో ఆమెతో వాదించడం వ్యర్థమని "సరే వెళ్లిరా" అని రెండు మాటలు మాట్లాడి అతనామెను బైక్ మీద గుంటూరు వెళ్లే నాన్‌స్టాప్ బస్ ఎక్కించి తిరిగి వచ్చాడు.

○ ○ ○

హాల్లో ఈజీ చెయిర్లో కూర్చుని న్యూస్‌పేపర్ చదువుతున్న ఆదిత్య తన ఇంటి గేటు ముందు ఆటోలో నుంచి దిగిన తన చెల్లెల్ని చూసి "రామ్మా, దుర్గా" అన్నాడు. అప్పుడే కిచెన్‌లోంచి వచ్చిన శాంత బావున్నావా దుర్గ" అని ఆప్యాయంగా అడిగింది. కాని ఆమె నుంచి సమాధానం లేదు. పైగా మొహంలో సంతోషం కూడా లేదు. ఆమె పరిస్థితిని గమనించి శాంత "నువ్వు ముందు వెళ్ళి ఫ్రెష్ అయి రా. టిఫిన్, కాఫీ రెడీ చేస్తాను" అంది. దుర్గ సూట్ కేసును గదిలో పెట్టి బాత్‌రూంలోకి వెళ్లింది.

"దీని చిన్నతనపు అలక ఇంకా పోయినట్టులేదు. బావగారి మీద అలిగి వచ్చినట్టుంది" అన్నాడు ఆదిత్య.

"కాని పిల్ల వట్టి అమాయకురాలండి. మీరన్నట్టు చిన్నతనపు అలవాట్లను వదుల్చుకోలేకుండా వుంది. క్రమంగా దార్లోకి వస్తుంది లెండి" అంది శాంత ఆడపడుచుని సమర్థిస్తూ..

ఆదిత్యకు అన్నదమ్ముల్లేరు, అక్కల్లేరు, దుర్గ ఒక్కతే చెల్లెలు. ఆమె చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో అతనే ఆమెని గారాబంగా పెంచాడు. అతనికి తండ్రి మిగిల్చిన ఒక పెద్ద ఇల్లుంది. దానిలో ఒక వాటాలో అతను చెల్లెలితో వుంటూ, రెండవ వాటాని అద్దెకిచ్చాడు. ఆ అద్దె డబ్బుతో ఇంట్లో గడుపుతూ అతను, ఆమె చదువుకోగలిగారు. అతను బి.కాం. పాసయి బ్యాంక్‌లో ఉద్యోగం సంపాదించాడు. చెల్లెలు ఏది కావాలని అడిగినా తన ఆర్థిక స్తోమతకు మించినదైనా లెక్క చేయకుండా దాన్ని తెచ్చిపెట్టి ఆమెకు సంతోషం కలిగించేవాడు. కాని ఆమె కోరిక నెరవేరకపోతే అన్న దగ్గర అలిగి కూర్చునేది. ఈ చిన్నపిల్లల మనస్తత్వం ఆమెకి పుట్టింట్లో అలవాటుగా మారి అత్తింట్లో కూడా తరువాత కొనసాగుతోంది.

ఆదిత్యకు శాంతతో వివాహమైంది. పేరుకి తగినట్టు ఆమెలో శాంతం, ఓర్పు, మంచితనం ఉన్నాయి. ఆమె కూడా తన భర్తలాగే దుర్గని ప్రేమగా చూసుకుంది. ఆమె ఇంటర్మీడియెట్ పాసవగానే రాజుతో వివాహమైంది. అతను మంచి వాడు, యోగ్యుడు. బి.ఎ.పాసయి ఎల్.ఐ.సి ఆఫీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కట్న కానుకల పట్టింపు తనకు లేదని రాజు ముందుగానే చెప్పడం వల్ల ఆదిత్య ఆర్థిక ఇబ్బందిని ఎదుర్కోకుండా చెల్లెలి పెళ్ళి చేయగలిగాడు. రాజు కూడా మధ్య తరగతివాడే.

○ ○ ○

పదిగంటలకు ఆదిత్య బ్యాంక్‌కి వెళ్లడానికి రెడీ అయ్యాడు. అతనికి లంచ్ క్యారేజ్ ఇస్తూ శాంత "సాయంకాలం బ్యాంక్‌లో పని అయిన వెంటనే త్వరగా ఇంటికి రండి. మీరు నేను దుర్గ ఏదైనా సినిమాకు సరదాగా వెళ్దాం" అంది. అతను అలాగే అని చెప్పి వెళ్లాడు.

సాయంకాలం అయిదున్నరయింది. శాంత రెడీ అవుతూ "దుర్గా! నువ్వు కూడా రెడీ కావాలి. మీ అన్నయ్య వచ్చే వేళయింది" అంది. కాని దుర్గకి సినిమాకు వెళ్లాలనే ఆసక్తి లేకపోయినా వదిన బలవంతం మీద మేకప్ చేసుకుని రెడీ అయింది. టైం గడుస్తోంది కాని ఆదిత్య ఏడు గంటలయినా రాలేదు. ఏడున్నరకి కూడా రాలేదు. చివరికి ఎనిమిది గంటలకి అతను వచ్చాడు. అతన్ని ఎందుకాలస్యమైందని అడక్కుండా శాంత ముగ్గురికి టిఫెన్, కాఫీలు రెడీ చేసింది. అతను శాంతతో "ఈ సాయంకాలం నా కొలీగ్ రమేష్ బైక్ ట్రబుల్ ఇవ్వడంతో అతను దాన్ని రిపేర్‌కి ఇచ్చాడు. అతన్ని నా బైక్ మీద అతనింటికి తీసుకు వెళ్తుండగా ఒక సందు మలుపు తిరుగుతున్నప్పుడు పడిపోయాడు. కాలికి గాయం అయింది. వెంటనే అతన్ని హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళి ఆ గాయానికి మందు వేయించి, కట్టుకట్టించి అతన్ని ఇంటి దగ్గర దిగబెట్టి వచ్చేసరికి ఇంత ఆలస్యం అయింది. ఈ రోజు నిరాశపరిచాను" అన్నాడు.

"దీనికి నిరాశ పడాల్సిన అవసరం ఏముంది? ఈ రోజు కాకపోతే మరో రోజు వెళ్లొచ్చు. కానీ

మీరు తోటి ఉద్యోగిని సమయానికి ఆదుకుని అతనికి సహాయం చేయడం చాలా మంచి పని. అది సినిమా కంటే ఎక్కువ అంది శాంత శాంతంగా. శాంత మాటలు దుర్గ చెంప మీద చెళ్ళుమన్నట్టు ఆమెకు వినపడినాయి.ఆమెకి కిందటి నెలలో జరిగిన సినిమా సంఘటన గుర్తుకు వచ్చింది.

ఆ రోజు రాజు ఆఫీసుకు వెళ్ళే ముందు దుర్గ "ఇవాళ సినిమాకు వెళ్దాం. సాయంకాలం త్వరగా రండి" అని చెప్పింది. అతను సరేనన్నాడు. ఆ సాయంకాలం ఆమె అయిదున్నరకే రెడీ అయ్యింది. అతని కోసం ఎదురు చూస్తోంది. ఆరు, ఆరున్నర, ఏడయినా అతను రాలేదు. ఆమె ఓర్పు నశించింది. చివరికి అతను ఏడున్నరకి వచ్చాడు. సినిమాకు వెళ్ళే కోరిక నెరవేరలేదని ఆమె సహనం కోల్పోయింది. అతనికి టిఫిన్, కాఫీ ఇవ్వకపోగా కోపంతో అతన్ని పలకరించలేదు దుర్గ! ఆఫీస్‌లో మా పని అయిన వెంటనే మా మేనేజర్ ముందుగా చెప్పకుండా అప్పటికప్పుడు ఒక మీటింగు అర్జెంట్‌గా ఏర్పాటు చేశాడు. అది ఏడింటికి ముగిసింది. ఇంటికి చేరుకునే సరికి ఈ టైమయింది" అని రాజు శాంతంగా తన ఆలస్యానికి కారణాన్ని వివరించాడు. కాని ఆమె శాంతించలేదు. అతనితో రాజీ పడలేదు. కాని అదే రకం పరిస్థితిలో సినిమాకు వెళ్ళే కోరిక వదిన విషయంలో నెరవేరకపోయినా ఆమె ఎంత సహనంగా, అవగాహనతో అన్నతో రాజీ పడింది! ఈ ఆలోచనతో దుర్గ మనసులో పశ్చాత్తాపం ప్రారంభమైంది. భర్తను అర్థం చేసుకోకపోవడంలో తన తప్పును గ్రహించింది. కాని వెంటనే తిరిగి భర్త దగ్గరకు వెళ్ళాలనే నిశ్చయానికి రాలేకపోయింది.

ఆ విధంగా ఒక నెల గడిచింది. అన్న, వదిన ఆమెను ప్రేమగా చూసుకుంటున్నారు. దుర్గ తన ఇంటికి ఎప్పుడు వెళ్తుందని వాళ్ళు ఆమెను ఎన్నడూ అడగలేదు.

○ ○ ○

శాంత పుట్టిన రోజు వచ్చింది.

"నీ బర్త్‌డేకి ఏ గిఫ్ట్ కావాలి? నాకు బోనస్ డబ్బు కూడా ఆ రోజే వస్తుంది" అని ఆదిత్య శాంతని అడిగాడు. ఆమె సంతోషంగా చిరునవ్వుతో మన పెళ్లయినప్పటి నుంచి బంగారు గాజులు కావాలని కోరిక వుంది" అంది.

"సరే, నువ్వు కోరినట్టు బంగారు గాజులే తెస్తాను"

అని అతను ఆఫీస్‌కు వెళ్లాడు. ఆ సాయంకాలం అతను తెచ్చిన గిఫ్ట్‌ను ఆమెకు అందించాడు. ఆమె గిఫ్ట్ బాక్స్‌ను తెరిచి చూసింది. అందులో బంగారు గాజులకు బదులు ఒక ఒంటి పేట గొలుసు మాత్రం వుంది. కాని శాంత చెదరని చిరునవ్వుతో " ఈ బంగారు గొలుసు డిజైన్ చాలా బావుందండీ" అని దాన్ని తృప్తిగా మెడలో వేసుకుంది. నేను ఊహించనంత ఎక్కువగా బంగారు ధర పెరిగిందని ఈ రోజే నాకు అక్కడ తెలిసింది. నా దగ్గర వున్న డబ్బుకు ఈ గొలుసు మాత్రం వచ్చింది. బంగారు గాజుల కొనలేక నిన్ను నిరాశ పరిచాను. సారీ" అని జరిగింది చెప్పాడు ఆదిత్య. "మనలో మనకి ఈ సారీ ఎందుకండి? మన ఆర్థిక తాహతు మేరకు సర్దుకుపోవడంలోనే మన సంసారంలో ఆనందం, తృప్తి వుంటాయి. మన ఆర్థిక పరిస్థితి మెరుగుపడినప్పుడే నాకు బంగారు గాజులు కొనండి. ఈ రోజు మీరు కొన్న ఈ గొలుసు నాకు చాలా నచ్చిందండీ" అంది శాంత. ఆమె మాటలు దుర్గ రెండో చెంప మీద చెళ్ళు మనిపించాయి. దానికి కారణం దుర్గకి తన బర్త్‌డే సంఘటన మనసులో మెరిసింది.

దుర్గ తన పుట్టిన రోజుకి పట్టుచీర కావాలని భర్తని కోరింది. కాని అతను తన దగ్గర వున్న రెండు వేల రూపాయలతో ఒక షిఫాన్ చీరను మాత్రం కొనగలిగాడు. మూడు వేల ఖరీదు చేసే పట్టుచీరను కొనలేకపోయాడు. ఆమె అతను కొన్న చీరను కోపంతో విసిరి కొట్టింది. పట్టు చీర కోసం పట్టు పట్టిన ఆమె అతనిపై అలిగి పుట్టింటికి వచ్చింది మూర్ఖంగా. అన్న ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని వదిన అతను తెచ్చిన బర్త్‌డే గిఫ్ట్‌ను తను కోరింది కాకపోయినా సంతోషంగా స్వీకరించింది. కాని అటువంటి పరిస్థితిలో తనేం చేసింది? బర్త్‌డే కి పట్టుచీర తీసుకురాలేదని భర్త తెచ్చిన షిఫాన్ చీరను విసిరి పారేసింది. ఒకేరకమైన పరిస్థితుల్లో తన ప్రవర్తనకి, వదిన ప్రవర్తనకి మధ్య ఉన్న తేడా దుర్గకి తెలిసింది. భర్తని అర్థం చేసుకోకుండా అతని మీద అలిగి అజ్ఞానంతో పుట్టింటికి తను రావడం తప్పని ఆమె తెలుసుకుంది. ఆ రాత్రి ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. తన భర్త దగ్గరకు వెళ్ళి క్షమించమని కోరేటంత వరకు తనకు మనశ్శాంతి ఉండదు. వదినను ఆదర్శంగా తీసుకుని భర్తతో అన్యోన్యంగా కాపురం చెయ్యాలనే నిశ్చయంతో ఆమె నిద్రలోకి జారుకుంది. ఆమెలో మంచి పరివర్తన వచ్చింది.

మర్నాడు ఉదయం దుర్గ వదినకంటే ముందుగా లేచి రెడీ అయి సూట్‌కేస్ సర్దుకుంది.

"నేను మా ఇంటికి వెళ్తున్నాను" అని అన్న, వదినలతో చెప్పింది. ఆమెలో మంచి పరివర్తన వచ్చిందని గమనించిన వాళ్ళు చాలా సంతోషించారు. "నువ్వు మళ్ళీ ఇక్కడికి వచ్చేటప్పుడు బావగారితో కలిసి రావాలి" అన్నాడు ఆదిత్య. "అలాగే అన్నయ్యా" అంది దుర్గ. అతను చెల్లెలిని బైక్ మీద బస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి ఆమెను విజయవాడ వెళ్ళే నాన్‌స్టాప్ బస్‌లో ఎక్కించి ఇంటికి తిరిగి వచ్చాడు. దుర్గ ప్రవర్తనలోవాళ్ళు కోరిన పరివర్తన ఆమె తమతో కలిసివున్న ఒక నెలలో వచ్చిందని ఆదిత్య దంపతులు తృప్తిపడ్డారు.

✦



దిగ్గజ కన్నడ నటుడు రాజ్‌కుమార్‌పై ఓ పుస్తకం రాబోతోంది. ఇంతకు ముందు ఆయనపై చాలా పుస్తకాలు వచ్చినా ఇప్పుడొస్తున్న పుస్తకమంత సమగ్రమైనవి కాదు. ఏకంగా 2,148 పేజీలున్న ఆ పుస్తకం గురించే కన్నడ చిత్ర విమర్శకుల చర్చంతా.

దిగ్గజ పుస్తకం

కన్నడ సినిమా అభిమానులకు రాజ్‌కుమార్ ఆరాధ్యుడు. శాండల్‌వుడ్ పేరు చెప్పగానే గుర్తొచ్చే నటుడాయన. బూతు పదాలు, సిగరెట్, మందు వంటివి జాడ లేకుండా వెండి తెరపై వెలగడమే కాదు... వాస్తవ జీవితంలోను నిండైన వ్యక్తిత్వానికి చిరునామాగా ఆయన తన జీవనశైలిని గడిపారు. మ్యాట్నీ ఐడల్‌గా అభిమానుల గుండెల్లో ప్రదర్శితమైన రాజ్‌కుమార్ జీవితం వ్యక్తిత్వ వికాస పుస్తకం వంటిది. అలాంటి అగ్రతారకు చెందిన తెరపై నటనా జీవితంలోనే కాదు నిజ జీవితంలోను ఎన్నో మలుపులున్నాయి. వీరప్పన్ కిడ్నాప్ చేసిన ఉదంతం అందులో ముఖ్యమైంది. రాజ్‌కుమార్ అంటే కన్నడ ప్రజలకు ఎంతటి అభిమానముందో ఆ రోజులు చెబుతాయి. ఈ అంశాలన్నింటిపై ఇప్పటివరకు 75 పుస్తకాల వరకు వచ్చాయి. వీటిలో చాలా వరకు ప్రఖ్యాత రచయితలు, ఫిల్మ్‌మేకర్లు రాసినవే. రాజ్‌కుమార్ చిన్నకొడుకు, నటుడు అయిన పునీత్ రాజ్‌కుమార్ కూడా ఓ పుస్తకాన్ని వెలువరించాడు. అయితే ఇవన్నీ ఒక ఎత్తు. సినీ విమర్శకుడు, రచయిత అయిన దొడ్డహుళ్లూరు రుక్కోజీ పుస్తకం ఒక ఎత్తులా భావిస్తున్నారంతా. రెండు సంపుటాలుగా వస్తోన్న ఈ పుస్తకానికి 'డాక్టర్ రాజ్‌కుమార్ సమగ్ర చరిత్రె' (రాజ్‌కుమార్: ఎ కంప్లీట్ బయోగ్రఫీ) అని టైటిల్ పెట్టారు. పేరుకు తగ్గట్టే రాజ్‌కుమార్ జీవితంలోని ప్రతి కీలక మలుపును వివరిస్తూ రుక్కోజీ కూర్చిన ఈ పుస్తకం ఏకంగా పదికేజీల బరువు ఉంది. మొదటి సంపుటంలో రాజ్‌కుమార్ తొలినాటి జీవితం, ఆ రోజులు, కుటుంబ వివరాలుంటాయి. రెండో సంపుటంలో రాజ్‌కుమార్ నటించిన 200 చిత్రాలకు సంబంధించి కూలంకష చర్చ ఉంటుంది. ఎన్నో విషయాలు, విశేషాలతో సమగ్ర సమాచార సమాహారంగా కూర్చడానికి రెండు వేల పేజీలకు పైచిలుకే అవసరమయ్యాయి. అదీ చాలా స్ట్రిక్ట్ ఎడిటింగ్ చేసినా. దీనికి కారణం రుక్కోజీ 15 ఏళ్ల శ్రమ, తపనే. రాజ్‌కుమార్ జీవితంలోని ప్రతి అంశాన్ని సమూలంగా పరిశోధించి మరీ ఆయనీ పుస్తకాన్ని రాశారు. రాజ్‌కుమార్ గురించి అంతకు ముందు తెలీని, పెద్దగా వెలుగులోకి రాని ఎన్నో విషయాలు ఈ పుస్తకంలో ఉండబోతున్నాయని అభిమానులే కాదు రాజ్‌కుమార్‌పై పరిశోధన పత్రాలు సమర్పించాలని అనుకుంటున్న వారందరూ ఎదురుచూస్తున్నారు. అసలీ పుస్తక ప్రస్థానం కూడా అలా మొదలైందే.

రాజ్‌కుమార్ జీవితంపై పీహెచ్‌డీ థీసిస్ సమర్పించాలనుకున్న రచయిత సిద్ధలింగయ్య వద్ద రుక్కోజీ సహాయకుడిగా పనిచేసేవాడు. అంతటి గొప్ప నటుడిపై కేవలం థీసిస్ చేసి ఊరుకోవడం నచ్చలేదతడికి. అప్పటి నుంచే పని మొదలు పెట్టాడు. చెన్నై, మైసూర్, నంజన్‌గూడ, ముట్టత్తి, బిడాది, ధార్వాడ్, హుబ్లీ వంటి ప్రాంతాలతో పాటు రాజ్‌కుమార్ సొంతూరు సింగనల్లూర్‌ను కూడా సందర్శించి వివరాలు సేకరించాడు. 140 మంది నటులు, దర్శక, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎన్నో కొత్త విషయాల్ని క్రోడీకరించాడు. వీటిలో కొన్నింటిని ఇంటర్వ్యూల రూపంలోను ఇచ్చాడు. రాజ్‌కుమార్ గురించి తెలిపేందుకు అందివచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోలేదు. ఎప్పుడూ చూడని ఎన్నో ఛాయాచిత్రాలను, అరుదైన కాగితాల్ని అతి కష్టంతో బయటకు తీసుకురాగలిగాడు. అలా సుమారు 20 వేల ఫొటోల్ని సేకరించగా ప్రస్తుత పుస్తకంలో 8700 చిత్రాల్ని అచ్చు వేశారు. పుస్తక శాంపిల్‌ను పరిశీలించిన సాహిత్య విమర్శకులు కేవలం రాశిలోనే కాదు వాసిలోను అద్భుతంగా ఉందని రుక్కోజీని ప్రశంసించారు. రాజ్‌కుమార్ భార్య పార్వతమ్మ, కొడుకు పునీత్ రాజ్‌కుమార్, మరికొందరు నటులు, రాజ్‌కుమార్ హీరోయిన్లయిన హరిణి, జయంతి, షావుకారు జానకి వంటి వారు ఇదో గొప్ప పుస్తకమని తమ అభిప్రాయాల్ని వ్యక్తపరిచారు. మిగతా ఏ చిత్రపరిశ్రమలోను ఇటువంటి అరుదైన పుస్తకం లేదనేది కొందరి మాట. పండిట్ రాజీవ్ తారానాథ్, చంద్రశేఖర కంబర వంటి దిగ్గజాలు ఈ పుస్తకం కన్నడ పరిశ్రమకు చాలా ప్రత్యేకమైందని చెప్పారు. ఈ పుస్తక ప్రచురణ, ముద్రణలకు రుక్కోజీకి 87 లక్షల రూపాయల పైనే ఖర్చు అయ్యింది. రుక్కోజీ పట్టుదలను చూసి మిత్రులు కొందరు చేబదులుగా లక్షల రూపాయల్ని అందించారు. పుస్తకం విలువకు మరింత మెరుగులు దిద్దేందుకు శివకాశీలో అచ్చువేయించాడు. పుస్తక ముద్రణలో శివకాశీ ఓ బ్రాండ్‌నేమ్. అత్యంత నాణ్యంగా పుస్తకాల్ని ముద్రించడంలో శివకాశీ ఊరికి ప్రత్యేక స్థానముంది. అక్కడ అచ్చు వేయించిన పుస్తకాల్ని రవాణా చేసేందుకు మూడు ట్రక్కుల్ని వాడారు. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను భుజానెత్తుకున్న రుక్కోజీ శ్రమ వృథా కాలేదు. ఇప్పటికే ఆయన పుస్తక ప్రచురణపై స్క్రీన్ రైటర్ జేఎం ప్రహ్లాద్ ఓ డాక్యుమెంటరీ నిర్మించే ఆలోచనలో ఉన్నాడు. రుక్కోజీ కష్టాన్ని తెరకెక్కించేందుకు 80 నిమిషాల నిడివితో ఈ డాక్యుమెంటరీకి స్క్రిప్ట్ రెడీ చేసుకున్నాడు. ఇదే కాదు సినీ పరిశోధకులు కూడా ఇప్పటికే కాపీల కోసం రుక్కోజీని కలుస్తున్నారు. ఈ పుస్తకాన్ని గ్రంథమనడంలో దోషమేమీ లేదు. ◆

గోంగూర మటన్

కావాల్సిన పదార్థాలు

మటన్-కప్పు, గోంగూర-కప్పు, గసాలు-50 గ్రా, జీడిపప్పు-10 గ్రా, నూనె-సరిపడా, ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, కారం-టేబుల్ స్పూన్, పచ్చిమిర్చి-నాలుగు, ధనియాల పొడి-టీ స్పూన్, గరం మసాల పొడి-చిటికెడు

తయారీ

గసాలు, జీడిపప్పును కలిపి మెత్తగా గ్రైండ్ చేయాలి. పాత్రలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలను వేయించిన తర్వాత అందులో పచ్చి మిర్చి, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా పొడి ఒకదాని తర్వాత ఒకటిగా వేయాలి. అన్నీ వేగాక తర్వాత మటన్ వేసి తగినంత నీటిని ఉడికించాలి. మటన్ ఉడికిన తర్వాత గోంగూర, గసాలు జీడిపప్పు, మసాలా వేసి ఉడికిస్తే గోంగూర మటన్ రెడీ!

మటన్ పసంద్

కావాల్సిన పదార్థాలు

మటన్-కిలో, గరం మసాలా పొడి-2 టీస్పూన్లు, అల్లం వెల్లుల్లి-2 టేబుల్ స్పూన్లు, నెయ్యి- 50 గ్రా, ఉల్లిపాయలు-నాలుగు, టొమాటోలు- రెండు, కారం-2 టీ స్పూన్లు, పచ్చిమిర్చి-నాలుగు, పుదీనా-కట్ట, ఆమ్‌చూర్ పొడి- టీ స్పూను, ఉప్పు-సరిపడా, కొత్తిమీర తురుము-టేబుల్ స్పూను, గసగసాలు-టేబుల్ స్పూను,

గరం మసాలా దినుసులు: యాలకులు-రెండు, ధనియాలు-టీ స్పూను, జాజికాయ- ఒకటి, జాజిమొగ్గ-ఒకటి, దాల్చిన చెక్క- అంగుళం ముక్క, లవంగాలు- నాలుగు, జాపత్రి-రెండు

తయారీ

మటన్ ముక్కల్ని కడిగి పక్కన ఉంచాలి. గరం మసాలా దినుసులన్నింటినీ పలుచని బట్టలో మూట కట్టాలి. ప్రెషర్ పాన్‌లో మటన్ ముక్కలు, ఉప్పు, కారం, మసాలా దినుసులు మూట వేసి ఉడికించాలి.మందపాటి బాణలిలో నెయ్యి వేసి ఉడికిన మటన్ ముక్కల్ని వేసి వేయించాలి. మరో బాణలిలో కొద్దిగా నూనె లేదా నెయ్యి వేసి ఉల్లిముక్కలు, టొమాటో ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లంవెల్లుల్లి తురుము వేసి వేయించాలి. తరువాత మసాలా పొడి వేసి కలపాలి. ఆమ్‌చూర్‌పొడి, పుదీనా ఆకులు కూడా వేసి కలిపి ఈ మిశ్రమాన్ని మటన్ ముక్కల మీద వేసి కలపాలి. చివరగా గసగసాలు, కొత్తిమీర తురుము కూడా చల్లి దించాలి.

ఆలివ్ మటన్

కావాల్సిన పదార్థాలు

మటన్-500 గ్రాములు, ఉల్లిపాయలు (పెద్దవి)-2, వెల్లుల్లి రెబ్బ- 1, అల్లం ముక్క- 1, ధనియాల పొడి- 2 చిన్న చెమ్చాలు, యాలకులు-2, జీలకర్ర-2 చిన్న చెమ్చాలు, దాల్చిన చెక్క-1ముక్క, ఆలివ్ ఆయిల్-1 టేబుల్ స్పూను, పెరుగు, కారం, ఉప్పు- రుచికి సరిపడా

తయారీ

మటన్‌ను శుభ్రంగా కడగాలి. కడాయిలో నూనె వేసి వేడి చేసుకుని అందులో మసాలా దినుసులు,ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి పేస్టు, ఉప్పు, కారం కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న మంటపై వేయించాక అందులో మటన్ వేసుకుని కొద్దిసేపు పెద్ద మంటపై ఉడికించాలి. నీళ్లకు బదులుగా మటన్‌లో పెరుగు వేసుకుని అది ఇంకేవరకు పెద్ద మంటపై ఉంచాలి. మటన్ ఉడికాక చివరగా కొత్తిమీర ఆకులను తరిగి అందులో వేయాలి.

తవా గోష్ట్



ఘడె మసాలా

కావాల్సిన పదార్థాలు

మటన్- కిలో, నూనె- అర కప్పు, దాల్చిన చెక్క- అంగుళం సైజు ముక్కలు రెండు, పలావు ఆకులు- 4, యాలకులు- 10, లవంగాలు-12, ఉల్లిపాయలు-4, అల్లం తురుము- 2 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి తురుము-2 టేబుల్ స్పూన్లు, టొమాటోలు-3, ఉప్పు- సరిపడా, మిరియాలు-2 టీ స్పూన్లు, ఎండు మిర్చి-5, ధనియాలు-2 టేబుల్ స్పూన్లు

తయారీ

ఉల్లి, టొమాటోలు సన్నగా తరగాలి. మందపాటి పాన్ లేదా బాణలిలో నూనె వేసి అన్ని రకాల మసాలా దినుసులూ వేసి వేయించాలి. తరువాత మటన్ ముక్కలు కూడా వేయించాలి.తరువాత ఉల్లిముక్కలు టొమాటో ముక్కలు వేసి కలపాలి. ఇప్పుడు మూత పెట్టి చుట్టూ పిండితో మూసేసి దమ్ చేసినట్లుగా సుమారు అరగంట సేపు ఉడికించి తీయాలి.

ఎన్ని సార్లు ?

ఒక కుక్క పిల్ల పది అడుగుల లోతైన గుంతలో పడిపోయింది. ఇది ప్రయత్నించిన ప్రతీసారి మూడు అడుగులు మాత్రమే పైకి రాగలదు. తర్వాత రెండు అడుగులు జారి కిందపడిపోతుంది. ఆ కుక్క పిల్ల గుంత నుండి బయటకు రావాలంటే ఎన్ని సార్లు ప్రయత్నించాలి.

-చామర్తి వెంకటరామకృష్ణ

జవాబు: ఎనిమిది (ఎందుకంటే ఎనిమిదో అడుగు నుంచి దూకినప్పుడు బయటపడి మళ్ళీ వెనుకకు జారదు.)

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేను తెలుగు సినిమా హీరోయిన్ ని. ఇది నా చిన్ననాటి ఫోటో..నేనెవరో కనిపెట్టి చెప్పండి.!

జవాబు: అల్లు అర్జున్

బొమ్మ గీద్దామా

ఈ వారం ఆర్టిస్టు అంకుల్ బొమ్మను ఎలా గీయాలో నేర్పిస్తాడు. అల్లరి చేయకుండా నేర్చుకోండి.



చుక్కలు కలపండి



తేడాలు గుర్తించండి

ఈ రెండు చిత్రాల మధ్య ఐదు తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించండి.



మీసాల పక్షి

భలే ఉన్నాయే దీని మీసాలు. ఏంటి పక్షులకు కూడా మీసాలుంటాయా అనుకుంటున్నారు కదూ పిల్లలు. దీని పేరు మీసాల పక్షి మాత్రం కాదు.. ఇంకా టెర్న్ అని పిలుస్తారు. ఇదో సముద్ర పక్షి. స్టెర్నిడే జాతికి చెందింది. దీని గురించి మరిన్ని వివరాలు..

- ముదురు బూడిద రంగులో ఉండే వీటికి తెల్లటి మీసాల్లా ఈకలు పెరుగుతాయి.
- కొండ అంచుల్లోను, పెంగ్విన్‌లు వదిలేసిన చోట్ల ఇవి గూళ్లను పెడుతుంటాయి.
- ఇవి నలభై సెం.మీ. పెరుగుతాయి.
- చూడ్డానికి మగవి, ఆడవి ఒకేలా ఉంటాయి.
- రెంటికీ మీసాలు వస్తాయి. అయితే పెరిగి పెద్దయ్యాకే.
- వాటి మీసాల పొడవు బట్టి అవి ఎంత ఆరోగ్యంగా ఉన్నాయో చెప్పొచ్చు.
- పిల్లి కూతను పోలినట్టు అరుస్తాయి.
- పెరూ, చిలీ దేశాల సముద్ర తీరాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి.
- ఈక్వెడార్‌కు అప్పుడప్పుడు చక్కర్లు కొడుతుంటాయి.
- 12-14 ఏళ్ళ జీవిత కాలముండే ఇవి 21 ఏళ్ల వరకు కూడా బతకగలవు.
- ఆకాశంలో విహరిస్తూ సముద్రంలోని చిన్న చేపలపై నిఘా పెడతాయి. అవి నీటి ఉపరితలంలో కనిపించగానే వేగంగా దూసుకుపోయి వాటిని పట్టేస్తాయి.
- ఈత అంతగా రాదు గానీ, చక్కగా తేలుతూ ఛుర్చోగలవు.
- చూడ్డానికి పెద్ద తరహాగా ఉన్నా పెద్ద దొంగవి.
- మిగతా పక్షులు సేకరించిన ఆహారాన్ని కొట్టేస్తాయి.

కనుక్కోండి చుద్దాం

చిత్రంలోని బొమ్మల ఆధారంగా వాటి పేర్లను కనుక్కోండి.



లెక్క తేల్చండి

బాక్సుల్లో ఉన్న బొమ్మలు నిజానికి అంకెలు వాటిని కూడితే పక్కన ఉన్న మొత్తం వస్తుంది. ఏ బొమ్మ ఏ అంకె అనేది కూడికల ఆధారంగా కనుక్కోవచ్చు. ముందుగా మూడవ వరస నుంచి మొదలు పెడితే తేలిక. మరిందెకు ఆలస్యం? ఈ కింది బొమ్మల సంఖ్యను కనుగొనండి.



జవాబులు : 1)5, 2)8 3)7, 4)4

కొల్లేటి జాడల్లో...

కొల్లేటి జాడలు, అక్కినేని కుటుంబరావు,
పేజీలు-220,
వెల- రు.100/-
ప్రతులకు: నవోదయ, విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు.

అక్కినేని కుటుంబరావు రచయితగా, సినీ టీవీ దర్శకుడుగా సుపరిచితులు. మంచి పరిశీలకులు. కుటుంబరావు రచనలు చాలా వరకూ విషయ ప్రధానంగా వుంటూనే కథా గుణాన్ని కాపాడు కుంటాయి. తాజాగా ఆయన అందించిన నవల 'కొల్లేటి జాడలు'. ప్రపంచంలోనే అతి పెద్ద మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరు గత కొన్ని దశాబ్దాలలో మోతుబరుల నిర్వాకాలతో విచక్షణా రహితమైన ఆక్రమణలతో ఎలా విధ్వంసమైందీ నిరంతరం చర్చలో వున్నదే. హఠాత్తుగా ప్రకటించే చర్యలు ఇప్పటి కొల్లేటి వాసుల బతుకులకు నష్టదాయకంగా తయారైనప్పుడు ప్రతిఘటనలూ చూస్తుంటాం. ఈ నేపథ్యంలో- అక్కడ పుట్టి పెరిగిన కుటుంబరావు నలభై ఏళ్ల కల ఫలించి ఈ నవలగా మన చేతుల్లోకి వచ్చింది.

శ్రీనివాసరావు, రాధాకృష్ణ చెరువు గట్టుమీద నిలబడి చూస్తే కొల్లేరు అనంతంగా కనిపించలేదు. అన్నీ ముక్కలు ముక్కలుగా దర్శనమిచ్చింది. వారిద్దరూ అరవై ఏళ్ల కిందట అక్కడ గేదెలు కాసిన శీనూ, కిష్టుడూ. పులపర్రు అనే గ్రామం కేంద్ర బిందువుగా కథ నడుస్తుంది. ఆ వూళ్లో పెద్ద వ్యవసాయం లేకపోయినా మంచి మనసున్న రైతు రంగయ్య కొడుకు శీను. శీను తల్లి లక్ష్మమ్మ పుట్టింటి పరిస్థితి సరిగ్గా లేక తోబుట్టువులతో సహా అత్తారింటికి వచ్చి బాధలన్నీ కడుపులో పెట్టుకున్న మహాతల్లి. కృష్ణా గోదావరుల మధ్య మొత్తం 67 ఏరులు, కాలువలూ వాననీటిని తీసుకొచ్చి కొల్లేటిలో కలుపుతాయి. అందుకే అక్కడ జల వాయు భూ చరాలతో కూడిన అపారమైన జీవ వైవిధ్యం ఉంది. జనానికి కొరమీను మాంసం, కొంగమాంసం, కోడి మాంసం వండుకోవడం ఇచ్చిపుచ్చుకోవడం జీవితంలో భాగం. వీటికి తోడు బొచ్చెలు, బొమ్మిడాయిలతో రకరకాల వంటలు. కొల్లేరు పొంగిందంటే గ్రామాలు కొద్ది రోజులు మడుగులుగా మారి పోతాయి. కొంపలు, పంటలు పోయి నానా బాధలు. కాకయ్య వంటి రైతులు ఆదుకోవలసిన పరిస్థితి. ప్రకృతితో ప్రత్యక్ష పోరాటమైన జీవితంలో రెండు ప్రధాన కులాలు- వ్యవసాయం చేసే కమ్మలూ, చేపలు పట్టే వడ్డిరాజులూ. ఈ కుటుంబాలలోని స్త్రీ పురుషులూ పిల్లలూ వారందరి మానవ సంబంధాలు సహజంగా చిత్రించారు. మామూలు పల్లె కాదు గనక ఆ జలప్రకృతి ఫలితంగా అరుదైన సమస్యలూ సంఘర్షణలూ అగుపిస్తాయి. ఈ క్రమంలో ఆదర్శాలూ అసూయలూ అసహాయుల ఆక్రందనలూ అన్నిటికీ ప్రతిబింబాలైన పాత్రలుంటాయి. మొదటి సారి ఆ వూరినుంచి వెళ్లి చదువుతో పాటు అభ్యుదయ భావాలూ వంటపట్టించుకుని వచ్చిన పిచ్చయ్య (రచయిత అట్లూరి పిచ్చేశ్వరరావే!) సలహా మేరకు గ్రామస్తులు నడుం కట్టి కొల్లేరులో కొంత భాగం దడికట్టి సమాన భాగాలతో సమిష్టి వ్యవసాయం ప్రారంభించడం చేపలపై హక్కులు వడ్డెర్లకు ఇవ్వడం కథకు ప్రాణం. ఇలాంటి ఘట్టం ఏదీ ఇంతవరకూ తెలుగు సాహిత్యంలో రికార్డు కాకపోవడం ఆశ్చర్యం కాగా కుటుంబరావు నవల ఆ జాడలు పట్టి చూపించడం అభినందనీయం. ఇప్పటి కొల్లేరు పరిస్థితిని చెప్పడం స్వార్థాలను విమర్శించడం ముగింపు. రచయిత మనోభావాలతో పాటు మరో మూడు స్పందనలూ వున్నాయి.

- తెర

సాహిత్యంలో మార్క్సిస్ట్

సంప్రదాయానికి పునాదులు వేసిన నవల

నవల ప్రజలు,
మూలం: రాల్ఫ్ ఫాక్స్,
అనువాదం- వల్లంపాటి వెంకట సుబ్బయ్య,
పేజీలు: 146/-,
వెల: 100/-, ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, హైదరాబాద్.

రాల్ఫ్ ఫాక్స్ నిజమైన కలం వీరుడు. పెన్ను, గన్ను పట్టి పోరాడిన గొప్ప మార్క్సిస్ట్. తాను నమ్మిన ఆదర్శాల కోసం ప్రాణతర్పణం చేసిన వాడు. 1937 సంవత్సరంలో మూడు గొప్ప మార్క్సిస్ట్ సాహిత్య గ్రంథాలు ప్రపంచం ముందుకు వచ్చాయి. అవి రాల్ఫ్ ఫాక్స్ "నవల-ప్రజలు", ఆలెక్ వెస్ట్ రాసిన crisis in criticism, క్రిస్టఫర్ కాడ్వెల్ రాసిన illusion and reality కూడా ప్రచురితమయ్యాయి. ఈ మూడు గ్రంథాలు సాహిత్యాధ్యయనంలో మార్క్సిస్ట్ సంప్రదాయానికి పునాది రాళ్ళు వంటివి. 1936లో హిట్లర్, ముసోలినీల మద్దతుతో... స్పానిష్ ఫాసిస్టులు ప్రజాస్వామికంగా అధికారంలోకి వచ్చిన రిపబ్లికన్ ప్రభుత్వం మీద తిరుగుబాటు చేశారు. స్పానిష్ ప్రజలు ఆ తిరుగుబాటును తిప్పి కొట్టడానికి సాయుధ పోరాటాలు ప్రారంభించారు. ఈ యుద్ధంలో ఎందరో కవులూ-రచయితలు కూడా పాల్గొన్నారు. 1936లో రాల్ఫ్‌ఫాక్స్ యుద్ధ రంగంలో చేరి 1937లో వీర మరణం పొందాడు. 'ప్రజలు' నవల రాల్ఫ్ ఫాక్స్ విస్తృత పాండిత్యానికి, నిశితమైన ఆలోచనకూ అద్దం పడుతుంది. టిల్ ఉలెన్ స్పీగల్ 'ఎ లెజండ్ ఆఫ్ రివోల్ట్ (1928)' అన్న వ్యాసంలో సాహిత్య విమర్శతో అతని కృషి ప్రారంభమైంది. 'సమకాలీన విప్లవ పోరాటాల గురించి ఆధునిక రచయితలు మహాకార్య పద్ధతిలో నవలలు రాయాలి'. అన్న ప్రతిపాదన మొదటి సారిగా ఈ వ్యాసంలో కనిపిస్తుంది. ఈ అంశమే విస్తృతంగా 'ప్రజలు' నవలలో చర్చించ బడింది. దాదాపు 12 అధ్యాయాలుగా ఈ గ్రంథం నడుస్తుంది. మార్క్సిజం-సాహిత్యం, సత్యం వాస్తవికత, నవల-వాస్తవికత, మహాకావ్యంగా నవల విక్టోరియన్ యుగంలో వెనకడుగు, సృజనాత్మక వైతాళికులు, హీరో మరణం, సామ్యవాద వాస్తవికత, సజీవ మానవుడు, మనం మరిచిపోయిన రచన కళ, సాంస్కృతిక వారసత్వం అంశాల గురించి మార్క్స్ అభిప్రాయాలు రాశారు. అనువాదం చాలా బాగుంది. ప్రాచీన గ్రంథాలైన టి మార్కియోస్ బాంక్వెట్, డాఫ్నా అండ్ చోలీ ఇంకా వెనక్కి క్రీ.పూ 5వ శతాబ్దం హెరొడోటస్ వద్దో నవల చరిత్ర ప్రారంభమౌతుంది. హెన్రీ ఫీల్డింగ్ (1707-1754) 'టామ్ జాన్స్' నవల, జేమ్స్ జాయిస్ 'యులిసిస్', టెన్నిసన్ 'ఇడియల్స్ ఆఫ్ ది కింగ్' లాంటి ఆధునిక రూపాల్ని రాల్ఫ్ చర్చించారు. డేనియల్ డీఫో (1660-1731): రాసిన 'రాబిన్‌సన్ క్రూసో', హోమర్ 'ఒడిసీ' రచనలు... జాన్ స్టువర్ట్ మిల్ (1806-73) రచనలు.. సాంస్కృతిక జీవితం పత నం కావటానికున్న అసలు కారణాలను 'కమ్యూ నిస్టు ప్రణాళిక'లో ఏంగిల్స్-మార్క్స్ బయట పెట్టిన అంశాలు... మైకేల్ ఏంజిలో (1475-1564) ఇతర పాశ్చాత్య నవలాకారులు-నవలలూ.. సమగ్రంగా విశ్లేషించిన సైద్ధాంతిక మహాగ్రంథం.

- తంగిరాల చక్రవర్తి

రంగు రంగుల అరటి

కదళీ ఫలం. అదేనండీ! అరటి పండు. ప్రపంచ ప్రజలు ఇష్టంగా తినే పండు. నిజానికి ఇది ఆసియా దేశాలలోనే పుట్టిందని చెప్తుంటారు. పండుగా, కూరగా, నైవేద్యంగా ...రకరకాలుగా... ఆకలి తీరుస్తున్న అరటి ... యాపిల్ పండుతో సమానమైన పోషక విలువలను అందిస్తుందన్న విషయం చాలా మందికి తెలీదు. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఇది పలు రంగుల్లో కూడా దొరుకుతుంది. చూశారుగా. మీ ఎదురుగా ఎన్ని రంగుల అరటిపళ్లు కొలువు తీరాయో! పసుపు, ఆకుపచ్చ, గులాబీ, ఎరుపు, ఆకుపచ్చ-తెలుపు, లేత నీలం, ఊదా రంగుల్లో అందుబాటులో వున్నాయి. ఇన్ని రంగుల్లో కనిపించినా తోలు వలిస్తే లోపలి పండు తెల్లగానే వుంటుంది. కొన్నిట్లో మాత్రం పసుపు, లేత ఎరుపు రంగుల్లో వుంటుంది. పలు రంగుల్లోనే కాదు. రకరకాల ఆకారాల్లోనూ ఇవి లభ్యమౌతుంటాయి. కొన్ని పొట్టిగా, పొడవుగా, లేత బెండకాయల్లా సొగసుగా, ముకుళిత హస్తాల్లా ...చూపరులను విపరీతంగా ఆకట్టుకుంటాయి. రంగు ... ఆకారం... సరే. రుచి సంగతేంటి? అంటారేమో! రంగుల అరటిపళ్లు కొన్ని కొద్దిగా పుల్లగా వుంటాయి. ప్రార్థిస్తున్న చేతుల మాదిరిగా వున్న అరటిపండులో నారింజ, పీచ్, యాపిల్ పళ్ల రుచులుంటాయట. ఇన్ని రంగుల్లో, రుచుల్లో, రూపాల్లో లభిస్తున్న అరటి పండ్లను చూశాం. ఇక ఆస్వాదించడమే మిగిలింది. ఏవంటారు?!

మట్టిలోంచి బంగారం పండిస్తారు రైతులు. ఆ మట్టితో అందమైన గృహోపకరణాలు, ప్రతిమలు చేస్తారు చిత్రకారులు. అలాంటి ఒకానొక చిత్రకారిణి స్పెయిన్‌కు చెందిన ఇర్మా గ్రుయెన్‌హోల్జ్. ఆమె చేతిలో ఏం మాయ వుందో కానీ తను సృజించిన ప్రతి బొమ్మా సజీవంగా మన ముందు నిల్చినట్టు అనిపిస్తుంది. మామూలుగా చిత్రకారులంతా చిత్తు ప్రతిమలు వేసుకోవడానికి పెన్నులు, బ్రష్షులు, కంప్యూటర్లు వాడుతుంటారు. కానీ ఇర్మా అలా కాదు. సూక్ష్మ ఆకృతులను రూపొందిస్తుంది. తను వాడే ముడి పదార్థాల్లో ప్లాస్టిసైన్ అనే మట్టి ప్రధానంగా వుంటుంది. ఇంతటి ప్రతిభావంతురాలైన ఇమ్రా గ్రాఫిక్ డిజైనింగ్ చదివింది. మొదట ఓ యాడ్ ఏజన్సీలో ... తర్వాత ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేసింది. ఆ తర్వాత చిత్రకారిణిగా మారింది. అనేక పత్రికలు, వాణిజ్య ప్రకటనలకోసం పని చేసి అభినందనలు అందుకుంది.

మట్టిబొమ్మలే